

# తహశీల్దార్ కార్యాలయానికి కంప్యూటర్ బహుకరణ

**కల్వకుర్తి, ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి):**
కల్వకుర్తి తహశీల్దార్ కార్యాలయానికి తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాయితీ ఆశాదీప్ రెడ్డి కంప్యూటర్ ను బహుకరించారు. ఆయన ఆదేశాల మేరకు తాండ్ర గ్రామ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఈ కంప్యూటర్ ను కార్యాలయానికి అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో సాంకేతిక సేవలను మరింత మెరుగుపరచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తాండ్ర గ్రామ నాయకులు, తహశీల్దార్ కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పి హెచ్ సి లను తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



**మహబూబ్ నగర్ ఆగస్టు29 (వుదయం ప్రతినిధి)**
మహమ్మదాబాద్, గండీడ్, హన్వాడ పి.హెచ్.సి.లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ.శ్రీనివాసులుతనిఖీచేశారు.తనిఖీలలో భాగంగా వాక్సిన్ నిల్వలు, మందుల నిల్వలు, రోగ నిర్ధారణ సేవలు (ల్యాబ్ సర్వీసెస్ ), సిబ్బంది హాజరు వివరాలు,ఆసుపత్రులలోని పరిశుభ్రతను పరిశీలించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ కాన్పులు పెంచాలని వైద్యాధికారులను,సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై మరింత నమ్మకమును కల్గించాలని ఆదేశించారు.కార్యక్రమంలో డా.రాజు, డా. పులి విద్య, సుభాష్ చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

# హలో మాల.. ఛలో సెక్రటేరియట్



**- రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్.**
**దౌల్తాబాద్ ఆగస్టు 29(వుదయం)**
మాలల రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ 'హలో మాల ఛలో సెక్రటేరియట్' ముట్టడి విజయవంతం చేయాలని జాతీయ మాలమహానాడు పొలిట్ బ్యూరో ఛైర్మెన్ ర్యాకం శ్రీరాములు పిలుపునిచ్చారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలో హలో మాల ఛలో సెక్రటేరియట్ ముట్టడి కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం మాలలకు కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించకుండా ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న రోస్టర్ విధానం వల్ల మాలలకు అన్యాయం జరుగుతోందని, దీనిని వెంటనే సవరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగ రంగాల్లో మాలలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, అవకాశాలు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు."హలో మాల.. ఛలో సెక్రటేరియట్" నినాదంతో ఈ నెల 31 సోమవారం సెక్రటేరియట్ ముట్టడికి మాలలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు నాయకులు మండల యాదగిరి, మద్దెల చంద్రం, కరికే పర్వరములు, రాంపల్లి సతీష్, నవీన్, అజయ్, భానుప్రసాద్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

**ఆగస్టు 29, మిరుదొడ్డి (వుదయం)**
మద్యానికి బానిసై అనారోగ్యానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన చిట్యాల రాజిరెడ్డి (34) గత కొంతకాలంగా మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఉదయం ఇంటి తలుపులు తెరుచుకోకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు కిటికీలో నుంచి చూడగా రాజిరెడ్డి ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.



పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# కరికే అజయ్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



**దుబ్బాక, ఆగస్టు 29 (వుదయం):**
దుబ్బాక మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు భీమసేన తమ్ముడు కరికే అజయ్‌కుమార్ ఇటీవల మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా అజయ్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అజయ్‌కుమార్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు మల్లుగారి రామచంద్రారెడ్డి, దుబ్బాక మండల అధ్యక్షుడు కదురి నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగర రవి, వెంకటగిరి తండా గ్రామ సర్పంచ్ రంజ్యా నాయక్, కొండే గోపాల్‌రెడ్డి, నాయకులు సోలిపేట ప్రసాద్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మారెడ్డి, టీజేఎస్ కీసర స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలి

- **క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, ఆగస్టు 29:-వుదయం**
ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.నోటీసులు అందజేసిన అనంతరం తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై శనివారం ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లాల వారీగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీ,



హియరింగ్ తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు బూత్ లెవల్ అధికారులకు ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తూ, ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సంగారెడ్డి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సంగీత, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను అనుసరిస్తూ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నామని సీఈఓకు తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం నియోజకవర్గాల వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. నోటీసుల పంపిణీని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని మరింత వేగవంతం చేయాలని ఈఆర్ఓలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ గరిష్ట సంఖ్యలో నోటీసులను సంబంధిత ఓటర్లకు అందజేసి, తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ వారీగా, మండలాల వారీగా ప్రతిరోజూ నోటీసుల పంపిణీ పురోగతిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నోటీసుల పంపిణీ పెండింగ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మిగిలిన నోటీసుల పంపిణీని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి దశను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తూ, అర్హులైన ప్రతి ఓటరుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంగీత, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఏ.ఎస్సై కన్నయ్యకు పోలీసు అధికారిక లాంఛనాలతో ఘన అంతిమ వీడ్కోలు

**గద్వాల ఆగస్టు 29 (వుదయం కరస్పాండెంట్)**
జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ ఇటీవల దైవ దర్శనానికి తిరుపతికి వెళ్లిన ఏ.ఎస్సై కన్నయ్య కొండపైకి మెట్ల మార్గంలో వెళ్తుండగా గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన అంత్యక్రియలను శనివారం జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్., ఆదేశాల మేరకు పోలీసు అధికారిక లాంఛనాలతో ఘనంగా నిర్వహించారు.జిల్లా పోలీసు శాఖ తరపున పోలీసు అధికారులు, సిబ్బంది కన్నయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీసు గౌరవ వందనంతో అధికారిక లాంఛనాలు నిర్వహించి కన్నయ్యకు కన్నీటి వీడ్కోలు పలికారు. సుదీర్ఘకాలం పోలీసు శాఖకు అంకితభావంతో సేవలందించిన కన్నయ్య సేవలను ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులు, సహచర సిబ్బంది స్మరించుకున్నారు. ఆయన మృతి జిల్లా పోలీసు శాఖకు తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# పార్టీ సమావేశానికి రాని వారికి కమిటీల్లో చోటు వద్దు: జగ్గారెడ్డి ఫైర్

**సంగారెడ్డివుదయం :**
సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పార్టీ నాయకులపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్ మండలాల పార్టీ కమిటీలను ప్రకటిస్తున్న సమయంలో జాబితాలో పేర్లు ఉన్న పలువురు నాయకులు సమావేశానికి గైర్హాజరు కావడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, "రెండ్రోజుల్లో



నా కొడుకు ఎంగేజ్‌మెంట్ ఉన్నప్పటికీ, ఈ రోజు ఉదయం 11 గంటలకే సంగారెడ్డికి వచ్చాను. ఇంట్లో శుభకార్యం ఉంటే సాధారణంగా అందరూ ఏర్పాట్లలో నిమగ్నమై ఉంటారు. అయినప్పటికీ పార్టీ, ప్రజల కోసం నేను



సంగారెడ్డిలో ఉన్నాను" అని అన్నారు. తనకు రాజకీయాలంటే కేవలం పదవులు, హోదాలు కాదని, ప్రజలకు సేవ చేయాలనే తపన, రాజకీయాలపై ఆసక్తి, జీల్ ఉన్నవారికే పార్టీ కమిటీల్లో అవకాశం ఇవ్వాలని స్పష్టం చేశారు ."ఇంట్లో కూర్చుని రాజకీయాలు చేసే వారికి కమిటీల్లో చోటు ఇవ్వొద్దు. పార్టీ సమావేశాలకు హాజరై, ప్రజల్లో ఉండి పనిచేసే వారినే గుర్తించాలి" అని సూచించారు.సమావేశానికి హాజరు కాని నాయకులను వెంటనే కమిటీల నుంచి తొలగించి, సమావేశానికి వచ్చిన క్రియాశీలక కార్యకర్తలు, నాయకుల పేర్లను కమిటీల్లో చేర్చాలని మండల కమిటీ అధ్యక్షులను జగ్గారెడ్డి ఆదేశించారు. పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసే వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.

# ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్)పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు కార్యాచరణ రూపొందించాలి...జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**
**సంగారెడ్డి, ఆగష్టు 29:వుదయం:**
జిల్లాలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ-FLN) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి విద్యార్థిలో నిర్దేశిత అభ్యసన సామర్థ్యాలు సాధించేలా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు.
శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ సమీక్ష సమావేశంలో , ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు, విద్యార్థుల అభ్యసన స్థాయులు, పాఠశాలల పనితీరు, మూల్యాంకన ఫలితాలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రతి పాఠశాలలో విద్యార్థుల ప్రస్తుత అభ్యసన స్థాయి అంచనా ఫలితాల ఆధారంగా మెరుగైన విద్యను అందించాలని పేర్కొన్నారు.జిల్లా లో మొత్తం 254 FLN కాంపిటీంట్ పాఠశాలలో ఉన్నాయని అందులో చదువుతున్న విద్యార్థులందరికీ ఎఫ్ ఎల్ ఎన్





కాంపిటీన్సీర్ రావాలని వచ్చే విధంగా సూపర్వైజింగ్ చేయాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం పూర్తయ్యే నాటికి FLN కాంపిటీన్సీర్ తగ్గట్టు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.
మూల్యాంకన ఫలితాల ఆధారంగా విద్యార్థులలో ఉన్న అభ్యసన లోపాలను గుర్తించి, వాటి నివారణకు లోప నివారణ కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు.విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్, గణితం అంశాల్లో ప్రాథమిక సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి మండలంలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించేందుకు ఆకస్మిక మూల్యాంకనం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం FLN కి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. పాఠశాల లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి స్థాయికి అనుగుణంగా బోధనా పద్ధతులను అనుసరించి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలని సూచించారు. విద్యార్థులలో చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని తెలిపారు.
పాఠశాలల్లో లక్ష్య నిర్ధారణ పోస్టర్లు ఏర్పాటు చేసి, నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సంబంధిత పర్యవేక్షణ బృందాలు పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి ఎఫ్ఎల్ఎన్ అమలును పరిశీలించాలని సూచించారు.
ప్రతి పాఠశాలలో విద్యార్థుల విషయాల వారీ సామర్థ్యాలు, సాధించిన ఫలితాలు, అభ్యసన లోపాలు గుర్తించి, తక్కువ స్థాయి ఫలితాలు ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలిపారు.ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సాధించాలని సూచించారు.
తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాల ద్వారా తల్లిదండ్రులకు కూడా ఎఫ్ఎల్ఎన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, విద్యార్థుల అభ్యసన పురోగతిని తల్లిదండ్రులతో పంచుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి అవసరమైన ప్రాథమిక సామర్థ్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి, జిల్లా సమగ్ర శిక్షణ కోఆర్డినేటర్ బాలయ్య, విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సంబంధిత పర్యవేక్షణ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ ఎల్ ఎన్ నాణ్యమైన అమలుతోనే విద్యా ప్రమాణాల పెంపు

**జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక**
**నారాయణపేట ఆగస్టు29 (వుదయం ప్రతినిధి)**
జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక అధ్యక్షతన జిల్లా విద్యాశాఖాధికారి డా. గోవిందరాజులు సమక్షంలో మండల విద్యాశాఖాధికారులు, పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విద్యాశాఖ అధికారులతో పునాది అక్షరాస్యత సంఖ్యాజ్ఞానం కార్యక్రమాల అమలుపై జిల్లా స్థాయి సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమాల నాణ్యమైన అమలుతోనే విద్యా ప్రమాణాలను గణనీయంగా పెంపొందించగలమని పేర్కొన్నారు.పాఠశాలల్లో ఎఫ్ ఎల్ ఎన్ పర్యవేక్షణ కేవలం గణాంకాలు, సందర్శనల సంఖ్యకే పరిమితం కాకుండా, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుదలకు దోహదపడే విధంగా నాణ్యమైన అకడమిక్ పర్యవేక్షణ జరగాలని స్పష్టం చేశారు.బోధన అభ్యసన పరంగా వెనుకబడిన పాఠశాలలను గుర్తించి, వాటికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు నిరంతర అకడమిక్ మద్దతు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పాఠశాలను పోటీ తత్వాల పాఠశాలలుగా తీర్చిదిద్దే దిశగా అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ నెలలో అత్యధిక సంఖ్యలో ఎఫ్ ఎల్ ఎన్ సందర్శనలు పూర్తి చేసిన ఎంఈఓలు, సిహెచ్ఎం లను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జడ్పీహెచ్ఎస్ పెద్దకడుమూర్ సిహెచ్ఎం వెనుకబడిన పాఠశాలల్లో చేపట్టిన ప్రత్యేక చర్యలు, జడ్పీహెచ్ఎస్ మొగల్మడుగు సిహెచ్ఎం సాధించిన 100 శాతం విద్యార్థుల హాజరు, గ్రామస్థుల సహకారంతో చేపట్టిన కార్యక్రమాలు, అలాగే కొత్తపల్లి ఎంఈఓ సమర్పించిన సమగ్ర విజిట్ నివేదికలను పరిశీలించి వారి ఉత్తమ పద్ధతులను కలెక్టర్ అభినందించారు. ఇటువంటి ఉత్తమ విధానాలను ఇతర పాఠశాలలు, మండలాలు కూడా అనుసరించాలని సూచించారు.ప్రతి పాఠశాలలో నిర్వహించిన బేస్ లైన్ అసెస్మెంట్ ఆధారంగా స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, ప్రతిరోజూ మధ్యాహ్నం 3.00 గంటల నుండి 4.00 గంటల వరకు ఎఫ్ ఎల్ ఎన్ ఎన్ రిచ్ మెంట్ పిరేడ్ ను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.పాఠశాలల సందర్శనలకు సంబంధించి నిర్దేశించిన సందర్శించే నియమ నిబంధనలను తప్పనిసరిగా పూర్తి స్థాయిలో అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.ప్రతి సందర్శనలో తరగతి గది పరిశీలన, విద్యార్థుల అభ్యసన స్థాయి అంచనా, ఉపాధ్యాయులతో అకడమిక్ చర్చలు అవసరమైన తక్షణ మార్గదర్శకత్వం ఉండేలా చూడాలని తెలిపారు.పాఠశాలల విద్యా కార్యక్రమాలకు అంతరాయం కలగకుండా ఉపాధ్యాయుల సాధారణ సెలవులను ముందస్తు అనుమతితోనే మంజూరు చేయాలని, ఒకే సమయంలో 10-15 శాతానికి మించి సిబ్బంది సెలవులో ఉండకుండా ప్రధానోపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలోని ప్రతి ఎం ఈ ఓ, సి హెచ్ ఎం ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయుడు సమన్వయంతో పనిచేసి, ప్రతి చిన్నారిలో పునాది అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన సామర్థ్యాలను సాధించేలా కృషి చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. నాణ్యమైన బోధన, సమర్థవంతమైన పర్యవేక్షణ, నిరంతర ఉపాధ్యాయ మద్దతు లక్ష్యాధారిత అభ్యసనంతో నారాయణపేట జిల్లాను ఎఫ్ ఎల్ ఎన్ లో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు.



# జిల్లా ఏ ఐ వై ఎఫ్ జిల్లా అధ్యక్షులుగా దేశమోని ఆంజనేయులు

**తెలకపల్లి ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి)**
మండల పరిధిలోని ఆలేరు కు చెందిన దేశమోని ఆంజనేయులు శనివారం నాగర్ కర్నూల్ జిల్లా ఏ ఐ వై ఎఫ్ అధ్యక్షులుగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనకు ఎంతో నమ్మకంతో రెండవసారి జిల్లా బాధ్యతలను అప్పజెప్పడం జరిగిందని నూతన అధ్యక్షులు దేశమోని ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి తన వంతు తోడ్పాటు అందిస్తామని తెలిపారు.



# మైనారిటీ అభ్యర్థులకు ఉచిత గ్రూప్–I, II, III, IV ఫౌండేషన్ కోచింగ్

**గద్వాల ఆగస్టు 29 (వుదయం కరస్పాండెంట్)**
తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC) నిర్వహించే గ్రూప్-I, II, III, IV పరీక్షలకు సిద్ధమయ్యే మైనారిటీ అభ్యర్థులకు ఉచిత ఫౌండేషన్ కోచింగ్ అందిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా తెలిపారు.తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ ఆధ్వర్యంలో ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, జైన మైనారిటీ వర్గాలకు చెందిన బీపీఎల్ (BPL) అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండటంతో పాటు బీపీఎల్ కేటగిరీకి చెందినవారై ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 1 నుంచి 14వ తేదీ వరకు ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణా తరగతులు 15 092026 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.శిక్షణా వేదిక: తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, ఇందిరా ప్రియదర్శిని కాలేజీ, MAM క్యాంపస్, నాంపల్లి, హైదరాబాద్.మరిన్ని వివరాల కోసం 0403236112, 9059050062 ఫోన్ నంబర్లను లేదా directorsccctelangana@gmail.com ఈమెయిల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.జిల్లాలోని అర్హులైన మైనారిటీ యువతీ యువకులు ఈ ఉచిత ఫౌండేషన్ కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా కోరారు.

# ఒకే బేసిన్.. రెండు పద్ధతులు!



**కొత్తపల్లి విద్యార్థుల సరికొత్త ప్రయోగం**
**దౌల్తాబాద్, ఆగస్టు 29 (వుదయం):**
ఒకే మరుగుదొడ్డి బేసిన్‌ను భారతీయ, పాశ్చాత్య పద్ధతుల్లో వినియోగించుకునేలా కొత్తపల్లి పాఠశాల విద్యార్థులు రూపొందించిన వినూత్న నమూనా అందరినీ ఆకట్టుకుంటోంది. రాయపోల్ మండలం కొత్తపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు 'ఇండియన్-వెస్ట్రన్ టాయిలెట్ బేసిన్' నమూనాను రూపొందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ భారతీయ పద్ధతిలో కూర్చునే మరుగుదొడ్ల వినియోగం అధికంగా ఉండగా.. ఇటీవలి కాలంలో పాశ్చాత్య పద్ధతి మరుగుదొడ్ల వినియోగం కూడా పెరిగిందని విద్యార్థులు గుర్తించారు. దీంతో రెండు రకాల మరుగుదొడ్లను వేర్వేరుగా ఏర్పాటు చేయాల్సి రావడం వల్ల స్థలం, డబ్బు వృథా అవుతున్నాయని భావించారు. రైళ్లు, విమానాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, కార్యాలయాలు, ప్రజా వినియోగ ప్రదేశాల్లోనూ రెండు రకాల మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గమనించి.. దీనికి పరిష్కారంగా ఒకే బేసిన్‌ను రెండు పద్ధతుల్లో ఉపయోగించుకునేలా నమూనాను రూపొందించారు.
ఈ ప్రాజెక్టును నాలుగో తరగతికి చెందిన మన్నే లతకిప్రియ, ఐదో తరగతికి చెందిన శ్రావణి రూపొందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. నాగరాజు మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఈ నమూనాను తయారు చేశారు. చిన్న వయసులోనే ప్రజలకు ఉపయోగపడే సమస్యను గుర్తించి, దానికి పరిష్కారం చూపేలా ప్రయోగం చేయడంపై ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.అన్ని చోట్లా అమలు చేయాలి తాము రూపొందించిన నమూనాను భారతీయ రైల్వేలు, విమానాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, ప్రజా వినియోగ ప్రదేశాల్లో అమలు చేయాలని విద్యార్థులు ఆకాంక్షించారు. ఒకే బేసిన్‌లో రెండు పద్ధతులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా స్థలంతో పాటు నిర్మాణ ఖర్చును కూడా ఆదా చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నంగునూరులో ఘనంగా పూజల హరికృష్ణ జన్మదిన వేడుకలు

**నంగునూరు, ఆగస్టు 28 (వుదయం)**
కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ జన్మదిన వేడుకలను నంగునూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి బాణాసంచా కాల్చారు. పూజల హరికృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి పూజల హరికృష్ణ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రజల ఆశీస్సులతో భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్‌కుమార్, రాపోల్ రాజహుదూర్‌రెడ్డి, ఎండీ ఇమ్రాన్, కర్ణకంటి రవీంద్రచారి, సర్పంచులు రాధాకృష్ణ, మైపాల్‌రెడ్డి, రంగు అశోక్, రంగారెడ్డి, రాజేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, జీవన్‌నాయక్, ప్రభాకర్, సామ్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కాటం కనకయ్య, చిన్న అజ్మత్, వెంకటేష్, రమేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





## ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ
# వేగవంతం చేయాలి

**నారాయణపేట టౌన్ ఆగస్టు29 (వుదయం ప్రతినిధి)**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని, సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నోటీసుల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని, నోటీసులు అందజేసిన రోజు నుండి 7 రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహించాలని సూచించారు. అనామలీస్/నో మ్యాపింగ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని, సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీ ప్రాతిపదికన నోటీస్ బోర్డుపై నవీకరించాలని, ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, నిర్దేశిత గడువులో పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ కొరకు నియమించిన ఎ.ఈ.ఆర్.ఓ. లకు అవసరమైన శిక్షణ అందించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## డాక్టర్ సుల్తాన ఉమర్ కు సన్మానం



**సామాజిక సేవలకు గుర్తింపుగా డాక్టరేట్, సేవారత్న అవార్డు, బంగారు పతకం.**
**- డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్.**
**దౌల్తాబాద్ ఆగస్టు 29(వుదయం)**

నిరుపేదలు, అనాథలు, అభాగ్యులకు అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డా. మహమ్మద్ సుల్తాన ఉమర్‌కు న్యూ లైఫ్ థీయాలాజికల్ యూనివర్సిటీ డాక్టరేట్‌తో పాటు మదర్ థెరిసా సేవా రత్న అవార్డు, బంగారు పతకం అందజేయడం అభినందనీయమని డి.బి. ఎఫ్. జాతీయ కార్యదర్శి పి. శంకర్ అన్నారు. శనివారం డా. సుల్తాన ఉమర్ నివాసంలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూసామాజిక సేవను బాధ్యతగా భావించి ఎన్నో ఏళ్లుగా పేదలు, అనాథలు, నిరుపేద కుటుంబాలకు తన వంతు సహాయాన్ని అందిస్తున్న సోషల్ రిఫార్మేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజాసేవకురాలు డా .సుల్తాన ఉమర్ సేవలు అభినందనీయమన్నారు. సమాజంలో ఆపదలో ఉన్న వారికి చేయూతనందిస్తూ, సేవాభావంతో ముందుకు సాగుతున్న ఆమెకు లభించిన ఈ గౌరవాలు సామాజిక సేవకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నామని తెలిపారు.పేదలు, అనాథలు, నిరాశ్రయులకు అండగా నిలుస్తూ మానవతా దృక్పథంతో ఆమె కొనసాగిస్తున్న సేవలు నేటి తరానికి, ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తిదాయకమన్నారు. సమాజంలో మానవతా విలువలు పెంపొందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. డా.సుల్తాన ఉమర్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆయన ఆకాంక్షించారు.డాక్టరేట్, మదర్ థెరిస్సా సేవారత్న అవార్డు, బంగారు పతకంతో సుల్తాన ఉమర్‌ను సత్కరించడం పట్ల డి.బి.ఎఫ్. నాయకులు, హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలవాలని పి. శంకర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంతరావుపల్లి ఉప సర్పంచ్ బైరం రమేష్, నాయకులు సతీష్, గణేష్, దాసరి హరిబాబు, ధార మల్లేష్, పుట్ట రాజు,గద్ద నరేష్, బాలకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యక్షేత్రంలో పోటెత్తిన భక్తులు

**శ్రావణ శనివారం సందర్భంగా మినీ జాతరను తలపించిన ఆలయ ప్రాంగణం**
**యాలాల ఆగస్టు 29 (వుదయంప్రతినిధి) :-**

తాండూర్ నియోజకవర్గంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న యాలాల మండలం జుంటుపల్లి శ్రీ సీతారామ చంద్రస్వామి దివ్యక్షేత్రంలో శ్రావణ శనివారం సందర్భంగా భక్తజనం పోటెత్తారు. ఉదయం నుంచే పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం సందడిగా మారి మినీ జాతరను తలపించింది.దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రకృతి రమణీయత నడుమ కొలువైన జుంటుపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ఆధ్యాత్మికతకు నిలయంగా భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది.ఆలయ పరిసరాల్లో గలగల పారే సెలయేరు,జుంటుపల్లి పెద్ద ప్రాజెక్టు,పచ్చని ప్రకృతి అందాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. ఆలయ ప్రాంగణంలో కొలువైన 23 అడుగుల ఏకశిలా అభయ ఆంజనేయ స్వామి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు,ప్రార్థనలు నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు వదిరాజ్ ఆధ్వర్యంలో భక్తులకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.శ్రావణ శనివారం సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు హైదరాబాద్‌కు చెందిన బిచ్చల మల్లయ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి నిర్వాహకులను అభినందించారు.స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.జుంటుపల్లి రాములోరి దివ్యక్షేత్రం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తూ రోజురోజుకూ విశేష ప్రాచుర్యం పొందుతోంది.ప్రకృతి ఒడిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్న ఈ పుణ్యక్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తే భక్తులతో పాటు పర్యాటకులను కూడా ఆకర్షించే అవకాశం ఉందని స్థానికులు, భక్తులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓ శాంతుకుమార్,దేవాలయం ఫ్యామిలీ ఫౌండర్ ట్రస్ట్ సభ్యులు శ్యామ్ సుందర్ రావు,వికారాబాద్ (జేపీ రావు)అడ్వకేట్ పార్థసారథి రావు,జ్యోతి రామారావు, జుంటుపల్లి సర్పంచ్ వాణిశ్రీ అరవింద్ రెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# జనసంద్రమైన నందగోకుల్.. రోడ్డు కోసం కదం తొక్కిన ప్రజలు

**హనుమాన్ ఆలయంలో పూజలు.. పాదయాత్రకు శ్రీకారం**
**నందగోకుల్–నస్కల్–చెల్మెడ కమాన్ వరకు బీటీ రోడ్డు నిర్మించాలి.**
**వారం రోజుల్లో పనులు ప్రారంభించాలి.. లేకుంటే ఉద్యమం ఉద్ధృతం.**
**ప్రజల పక్షాన రోడ్డు పూర్తయ్యే వరకు పోరాటం.**
**మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి**
**మెదక్ జిల్లా వుదయం**



నిజాంపేట మండలం నందగోకుల్ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నందగోకుల్, నస్కల్, చెల్మెడ ప్రాంతాల ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు భారీ స్పందన లభించింది. నందగోకుల్-చెల్మెడ కమాన్ వరకు బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ మాజీ డిప్యూటీ స్పీకర్, ఎం.పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి బిఆర్ఎస్ రేణులతో కలిసి శనివారం పాదయాత్ర నిర్వహించారు. నిజాంపేట మండలం నందగోకుల్‌లోని హనుమాన్ దేవాలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి పాదయాత్రను ప్రారంభించారు. నందగోకుల్ నుంచి చెల్మెడ కమాన్ వైపు సాగిన పాదయాత్రలో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని "రోడ్డు నిర్మించాలి.. ప్రజల కష్టాలు తీర్చాలి" అంటూ నినాదాలు చేశారు.పాదయాత్ర సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ... నందగోకుల్-నస్కల్-చెల్మెడ కమాన్ మధ్య రహదారి పూర్తిగా అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి సక్రమంగా లేకపోవడంతో వాహనదారులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారిందని, కంకర, గుంతలు, బురదతో రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా ప్రజలు ఈ రహదారిపై ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.రహదారి దుస్థితి కారణంగా విద్యార్థులకు అందుబాటులో ఉండాల్సిన ఆర్టీసీ బస్సు సైతం నిలిచిపోయిందని పద్మా దేవేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారని తెలిపారు.
రోడ్డు నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయిందని, కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారని పద్మా దేవేందర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం సుమారు రూ.3 లక్షల మేర నిధులు మంజూరు చేసినంత వరకు కాంట్రాక్టర్ పనులు చేశారని, అనంతరం రావాల్సిన బిల్లులు రాకపోవడంతో మిగిలిన పనులు నిలిపివేశారని వివరించారు.
కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, మిగిలిన రహదారి పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకుండా పనులు ఎలా పూర్తవుతాయి? ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ఇంకా ఎందుకు స్పందించడం లేదు?" అని ప్రశ్నించారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించాలని పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. "ప్రజా పాలన అంటే ఇదేనా రేవంత్‌రెడ్డిగారూ?" అని ప్రశ్నించారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఆరు గ్యారెంటీలతో పాటు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు.ప్రజా సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్షాలను విమర్శించడంపైనే ప్రభుత్వం దృష్టి సారించిందని ఆరోపించారు.రెండున్నరేళ్ల పాలనలో కనీసం ఒక రహదారి నిర్మాణాన్ని కూడా పూర్తి చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. అభివృద్ధి కేవలం పత్రికలు, కాగితాలకే పరిమితమైందని, క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సంబంధిత మంత్రులు, పీఆర్ & ఆర్‌బీ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్టర్‌కు రావాల్సిన బిల్లులు చెల్లించి, అవసరమైన నిధులు మంజూరు చేసి వారం రోజుల్లో రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు.ప్రభుత్వం వారం రోజుల్లో స్పందించకపోతే నందగోకుల్, నస్కల్, చెల్మెడ ప్రాంతాల ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. "రోడ్డు పూర్తయ్యే వరకు ప్రజల పక్షాన మా పోరాటం ఆగదు. ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం" అని తేల్చిచెప్పారు.కేసీఆర్ హయాంలో పదేళ్లపాటు ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్తు, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలిచామని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు కష్టాల్లోకి వెళ్లారని విమర్శించారు. రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

**ప్రజా కష్టాలు పట్టని ప్రభుత్వం: మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్‌రెడ్డి**
ప్రజా పాలన అంటే ప్రజల కష్టాలను గుర్తించి పరిష్కరించడం కానీ, సమస్యలను పట్టించుకోకుండా వదిలేయడం కాదని అన్నారు.
నందగోకుల్-చెల్మెడ కమాన్ రహదారి పరిస్థితి దారుణంగా ఉన్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. కేసీఆర్ హయాంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు.
కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనపై ప్రజలు విసుగు చెందారని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ శ్రీరామరక్షగా నిలుస్తుందని పేర్కొన్నారు.
ఈ పాదయాత్రను చూసైనా ప్రభుత్వం, అధికారులు బుద్ధి తెచ్చుకుని వెంటనే రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.
**మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి..**
కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల కష్టాలు పట్టవా అని ప్రశ్నించారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.
ఈ రహదారిపై ఇరు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా విద్యార్థులు రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రహదారి పరిస్థితి కారణంగా ప్రజా రవాణా కూడా ప్రభావితమైందన్నారు.వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజల కష్టాలు తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పోరాటం మరింత ఉద్ధృతం చేస్తాం.ప్రజల సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. వారం రోజుల్లో ప్రభుత్వం స్పందించి రోడ్డు పనులు ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని హెచ్చరించారు.ఈపాదయాత్రలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సొసైటీ అభివృద్ధికి ఆయువుపట్టు

**సూపర్ మార్కెట్ ఏర్పాటు**
**అయిజ, ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి)**



సొసైటీలు కేవలం రైతులకు రుణాలు అందించే వ్యవస్థలకే పరిమితం కాకుండా, రైతుల ఆదాయం రెట్టింపు అయ్యేలా కృషి చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అబ్దుల్ నబి అన్నారు. శనివారం పట్టణంలోని సింగిల్ విండో ఆవరణలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ మార్కెట్‌ను ఆయన సందర్శించారు.గతంలో సొసైటీలో పనిచేసే సిబ్బందికి సైతం జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం 25 మంది సిబ్బందికి ఉపాధి కల్పించడంతో పాటు లక్షలాది రూపాయల ఆదాయాన్ని ఆర్జిస్తూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అభివృద్ధి చెందిన సహకార సంఘాల్లో ఒకటిగా నిలవడం అభినందనీయమని అబ్దుల్ నబి ప్రశంసించారు.
సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ మార్కెట్ ద్వారా నెలకు సుమారు రూ.40 లక్షల వ్యాపారం జరుగుతోందని, ఏడాదికి రూ.5 కోట్ల టర్నోవర్ సాధిస్తున్నట్లు తెలిపారు. అలాగే సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పురుగుల మందుల దుకాణం ద్వారా ఏటా రూ.1.5 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు వ్యాపారం జరుగుతోందని పి ఏ సి ఎస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి వివరించారు. రైతులు అధిక వడ్డీల బారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతో దీర్ఘకాలిక రుణాల కింద ఇప్పటివరకు రూ.25 కోట్ల రుణాలను అందించినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ గద్వాల బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్ కుమార్, సూపర్వైజర్లు రవికుమార్, కిరణ్, కార్యాలయ సిబ్బంది మల్లేష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

**రాయపోల్ ఎంపీడీవో శ్రీనివాస్**
**దౌల్తాబాద్, ఆగస్టు 29 (వుదయం):**



ప్రభుత్వ ఆదేశాల మేరకు రాయపోల్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో డా. సిహెచ్. శ్రీనివాస్ కోరారు. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే వేదికపై సంబంధిత అధికారులను కలిసి సమస్యలను తెలియజేసే అవకాశం ప్రజావాణి ద్వారా కలుగుతుందని ఎంపీడీవో తెలిపారు. మండల ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో పాల్గొని తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఈ నెల 31న సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ మహా ధర్నా

**- 22ఏ నిషేధిత జాబితా నుంచి రైతుల భూములను తొలగించాలి**
**నంగునూరు, ఆగస్టు 29 (వుదయం):**



రైతుల పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ బీజేపీ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 31న సోమవారం ఉదయం 10 గంటలకు సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.మహా ధర్నా విజయవంతానికి సంబంధించి బీజేపీ నంగునూరు మండల అధ్యక్షుడు చౌదు చెర్ల వెంకట్రాంరెడ్డి అధ్యక్షతన శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. రైతుల పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల అనేక మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించి రైతుల భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.బీజేపీ సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించే మహా ధర్నాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పాల్గొని రైతుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించనున్నారని పేర్కొన్నారు.
**రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి :బీజేపీ మండల ఇన్‌చార్జి గుండ్ల జనార్ధన్**
22ఏ నిషేధిత జాబితా కారణంగా నష్టపోతున్న రైతులు, నంగునూరు మండలంలోని రైతులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మహా ధర్నాకు తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. 22ఏ జాబితాలో నష్టపోయిన ప్రతి రైతు తరఫున బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. రైతుల భూముల సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో బీజేపీ మండల ఇన్‌చార్జి గుండ్ల జనార్ధన్, జిల్లా ఉపాధ్యక్షుడు తొడుపునూరి వెంకటేశం, జిల్లా కార్యదర్శి వాసరి యాదమల్లు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వల్లపురెడ్డి రజనీకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బండి సతీశ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, సతీశ్‌గౌడ్, రజనీకర్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, వస్త్రాదుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి ఎస్జీఫ్ క్రీడలు



**- రూ.1.50 లక్షల విరాళం అందించిన గాడిపల్లి ఫౌండేషన్**
**దుబ్బాక, ఆగస్టు 29 (వుదయం)**

మండల స్థాయి ఎస్జీఫ్ క్రీడలు-2026ను ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 2 వరకు మూడు రోజుల పాటు హబ్సిపూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు దుబ్బాక ఎంఈవో జోగు ప్రభుదాస్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు SGF క్రీడలు దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.
క్రీడల నిర్వహణకు గాడిపల్లి ఫౌండేషన్ చైర్‌పర్సన్ గాడిపల్లి రఘువర్ధన్‌రెడ్డి రూ.1.50 లక్షల విరాళాన్ని అందించినట్లు తెలిపారు. క్రీడల ప్రారంభోత్సవానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్‌పర్సన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొననున్నారని ఎంఈవో తెలిపారు. క్రీడలను విజయవంతంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## పీహెచ్‌సీలో కోతుల బెడద.. రోగులకు తప్పని ఇబ్బందులు

**పగిలిన కిటికీలతో ఆసుపత్రిలోకి ప్రవేశిస్తున్న కోతులు**
**నంగునూరు, ఆగస్టు 28 (వుదయం)**



ప్రాణాలు కాపాడాల్సిన ఆసుపత్రిలో కోతుల బెడదతో రోగులు భయాందోళనకు గురవుతున్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్లమల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోతుల సంచారంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీలోని కిటికీల అద్దాలు పగిలిపోయి చాలాకాలం అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో కోతులు సులభంగా ఆసుపత్రిలోకి ప్రవేశిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు ఆసుపత్రికి వచ్చినప్పుడు కోతులు దాడి చేస్తాయేమోనని భయపడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ్య సమస్యలు కూడా నెలకొన్నాయని, దీంతో రోగులకు మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు తెలిపారు. వైద్యం కోసం వచ్చే ప్రజలకు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన ఆసుపత్రిలోనే ఇటువంటి పరిస్థితులు నెలకొనడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గట్లమల్యాల పీహెచ్‌సీని పరిశీలించాలని కోరారు. పగిలిన కిటికీలకు వెంటనే మరమ్మతులు చేయించడంతో పాటు కోతుల బెడదను నివారించేందుకు శాశ్వత చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## దేవాలయంలో సామూహిక పారిశుధ్య సముదాయం ప్రారంభం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న యాలాల ఎంపీడీవో శ్రీనిజ**
**యాలాల ఆగస్టు 29 ( వుదయం ప్రతినిధి):-**



మండల పరిధిలోని జుంటుపల్లి శ్రీ రామస్వామి దేవాలయంలో జిల్లాలోనే తొలిసారిగా స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్‌ను శనివారం యాలాల ఎంపీడీవో శ్రీనిజ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాలయానికి వచ్చే భక్తులు,గ్రామ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా ఈ సముదాయన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
గ్రామాల్లో పరిశుభ్రత,పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించేలా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జుంటుపల్లి సర్పంచ్ వాణిశ్రీ, గౌడ్ ఆలయ ఈఓ శాంత్ కుమార్,ఏపీవో జనార్ధన్, పంచాయతీ కార్యదర్శి లావణ్య, ఆలయ శాశ్వత ధర్మకర్తలు శ్యాంసుందర్ రావు ,అడ్వకేట్ పార్థసారథి రావు,అక్కంపల్లి గ్రామ సర్పంచ్ ర్యాలపేట్ లక్ష్మిరాములు, ఉపసర్పంచ్ రవీందర్ జుంటుపల్లి మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి,ఉపాధి హామీ ఈసీ శ్రవణ్ నిలకంఠం టెక్నికల్ అసిస్టెంట్ ఉదయ్ రమేష్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రశ్నించే తత్త్వం అలవర్చుకోవాలి

**- అక్షర సేద్యం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు**
**నంగునూరు, ఆగస్టు 29 (వుదయం )**

విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు విషయ అవగాహన పెంచుకుని, ప్రశ్నించే తత్త్వాన్ని అలవర్చుకోవాలని అక్షర సేద్యం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు అన్నారు. ప్రశ్నించే స్వభావం పెంపొందించుకుంటేనే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలుగుతారని పేర్కొన్నారు.శనివారం అక్షర సేద్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజగోపాలపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొత్తం రూ.10,800 విలువైన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేల్పుల రాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి అంశంపై అవగాహన పెంచుకుని, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ చదువుతో పాటు అన్ని రకాల పోటీల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.కనకయ్య అధ్యక్షత వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు బైతి దుర్గయ్య, ప్రతినిధులు మహేశ్, ప్రణయ్, జగదీశ్, నవీన్ పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గ్రామల
# కమిటీలు ఎన్నిక

**మహాదేవపూర్: ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి):**

కాంగ్రెస్ పార్టీ గ్రామల కమిటీల ఎన్నిక జరినట్లు మహాదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కం అశోక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఐటీ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కర్ణాకర్ ఆదేశాల మేరకు మహాదేవపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కమిటీల ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు ఈ సందర్భంగా పెద్దంపేట గ్రామ అధ్యక్షుడిగా గావిడి బాపు, అంబట్‌పల్లి గ్రామ అధ్యక్షుడిగా పత్తి రాజ బాపు,రాపెల్లికోట గ్రామ అధ్యక్షుడిగా కాట్రేవుల లక్ష్మీనారాయణ,ఎన్కపల్లి గ్రామ అధ్యక్షుడిగా సంగ రాజయ్య,లతోపాటు గ్రామాలలో 21 మంది సభ్యులతో గ్రామల కమిటీలను ఎన్నుకోవడం జరిగిందని అన్నారు, గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. గ్రామ కమిటీల ఎన్నికలతో పార్టీ సంస్థాగతంగా మరింత బలపడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వామన్ రావు, పాక్స్ చైర్మన్ తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ ఎరవెల్లి విలాస్ రావు, సర్పంచ్‌లు బీసుల లావణ్య రాజేష్, కల్లా గట్టయ్య, పర్వవేణి నిర్మలలక్ష్మణ్ యాదవ్, ఆకుల రాజయ్య, ఉప సర్పంచ్‌లు గద్దం రాజు గౌడ్, పొలం సంజీవ్, శ్రీనివాస్, చల్లూరి సదానందం చారి, అఫ్జర్ ఖురేషి, తడకల జగదీష్, రాఘవేంద్ర, దాగం సంతోష్, కోట సమ్మయ్య, బుర్రి శివరాజు, కదర్ల నాగరాజు, మాజీ ఉప సర్పంచ్‌లు మోతే సాంబయ్య, దోమల రాజేష్, చిప్ప జయంతు, బాల పోచం, మహ్మద్, స్వామి, రాములు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





# కదిలిన బీఆర్ఎస్ దండు.. 22ఏ బాధితులకు అండగా భారీ తరలింపు

**వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (ఆగస్టు 28)**

రామచంద్రపురం మండలం తెల్లాపూర్ డివిజన్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. 22ఏ నిషేధిత భూముల బాధితులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో పటాన్‌చెరులోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ నిరసన కార్యక్రమానికి వారు హాజరయ్యారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, ఇంద్రారెడ్డి, దయాకర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, శ్రీశైలం, గుడ్ల సాగర్, బాబ్జి, నర్సింహా, రవీందర్‌రెడ్డి, యాదయ్య, వెంకట్రం రెడ్డి, బీఆర్ఎస్వీ చెన్నారెడ్డి, కేసీఆర్ నగర్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడా ప్రతిభకు పెద్దపీట.. బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



**వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (ఆగస్టు 29)**

రామచంద్రపురం మండలం భేల్ MIG కాలనీలో తెలంగాణ రాష్ట్ర 45వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2026 ఘనంగా ప్రారంభమైంది. పోటీలను మెదక్ ఎంపీ రఘునందన్ రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి బాలురు, బాలికలు పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఐలేష్ పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఆసుపత్రికి తీసుకొచ్చినా ... పట్టించుకోలేదు..

## చివరకు ఏడేళ్ళ చిన్నారి మృతి

**నారాయణపేట ఆగస్టు29 (వుదయం ప్రతినిధి)**



నారాయణపేట మండలం కొల్లంపల్లి గ్రామానికి చెందిన కమ్మరి వెంకట్రాములు కుమార్తె చైత్ర రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది.తెల్లవారుజామున 4 గంటలకు చిన్నారి పరిస్థితి విషమించడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. దాదాపు ఐదు గంటల పాటు వైద్యం కోసం ఎదురుచూసినా పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.దీంతో చిన్నారిని జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కిడ్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ కూడా సరైన వైద్యం అందలేదని ఆరోపిస్తూ.. మళ్లీ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు.అరచేతుల్లో పాపను పట్టుకుని ఆస్పత్రి నుంచి ఆస్పత్రికి తిరిగిన తల్లిదండ్రులకు చివరకు కన్నీళ్లే మిగిలాయి.జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చిన 15 నుంచి 20 నిమిషాల్లోనే చిన్నారి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుమార్తె మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.అయితే.. ఆస్పత్రి వైద్యుల వాదన మరోలా ఉంది. చిన్నారి తల్లిదండ్రులు పేషెంట్ బెడ్ వద్ద కనిపించలేదని డాక్టర్ చెబుతున్నారు. కానీ.. తాము తెల్లవారుజామున 4 గంటలకే ఆస్పత్రికి వచ్చి.. ఉదయం 9 గంటల వరకు అక్కడే ఉన్నామని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

**అసలు ఈ ఐదు గంటల్లో ఏం జరిగింది?**

**చిన్నారికి వైద్యం ఎందుకు అందలేదు?**

**ఎవరి నిర్లక్ష్యం వల్ల ఈ పరిస్థితి వచ్చింది?**

విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఏనుగల్లు లో మృతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందచేసిన

## మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్

**పర్వతగిరి,ఆగస్టు29 ( వుదయం ప్రతినిధి ):**

పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ శనివారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల మాసాని మరియా , ధమిషెట్టి రాజు, రౌతు వీరస్వామిలు మరణించగా వారి నివాసాలకు వెళ్లి మృతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు, అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందచేసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతం గౌడ్ , మాజీ ఏఎంసి డైరెక్టర్ బోయినపల్లి యుగంధర్ రావు , మాజీ చౌటపల్లి చైర్మన్ గంధం బాలరాజు , డాక్టర్.మాజీ ఎంపీటీసీ సాంబానీ లింగమూర్తి , తక్కళ్లపెల్లి సంపత్ రావు , శీలం నాగరాజు , కానిగంటి రవి , వార్డు మెంబెర్ నల్లపు రంజిత్ ,మాజీ ఉప సర్పంచ్ లు గుండారపు సతీష్ రావు , పెండ్లి రమేష్ , గూడ నరేందర్ , గ్రామ పార్టీ అధ్యక్షులు మసాని వెంకట్ , మాజీ బోడ ఈర్య నాయక్ , బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సర్ ప్రక్రియను పారదర్శకంగా... నిబంధనల మేరకు పూర్తి చేయాలి

## అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్ నగర్ ఆగస్ట్ 29 (వుదయం ప్రతినిధి )**



ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)లో భాగంగా జిల్లాలో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2,36,590 నోటీసులు జనరేట్ చేయగా, 60,959 నోటీసులను సంబంధిత ఓటర్లకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. నోటీసుల జారీ, వారం రోజుల గడువు, డీసెంట్రలైజ్డ్ హియరింగ్ తదితర ప్రక్రియలను నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (CEO) సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, EROలు, AEROలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి SIR ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశానికి మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, పాల్గొన్నారు.ఈ సందర్భంగా CEO సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, SIR ప్రక్రియను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు జారీ చేసే నోటీసులను తప్పనిసరిగా సంబంధిత వ్యక్తికే వ్యక్తిగతంగా అందజేయాలని, నోటీసు అందజేసినట్లు సరైన ఎకనాలెజ్‌మెంట్ తీసుకుని రికార్డుల్లో భద్రపరచాలని సూచించారు.

నోటీసు అందుకున్న ఓటర్లు అవసరమైన పత్రాలు సమర్పించుకునేందుకు కనీసం ఏడు రోజుల సమయం ఇవ్వాలని తెలిపారు. విచారణ తేదీకి రెండు రోజుల ముందుగానే ఓటర్లకు మరోసారి సమాచారం అందించి, నిర్ణీత తేదీన విచారణకు హాజరయ్యేలా చూడాలని సూచించారు.

**వికేంద్రీకృత విధానంలో విచారణలు**

ఓటర్లకు సౌకర్యంగా ఉండేలా విచారణలను వికేంద్రీకృత విధానంలో నిర్వహించాలని CEO సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద లేదా సమీపంలోని కమ్యూనిటీ హాళ్లు, ఇతర అనువైన ప్రదేశాల్లో విచారణలు చేపట్టాలని తెలిపారు. అవసరాన్ని బట్టి పలు పోలింగ్ కేంద్రాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి విచారణలు నిర్వహించాలన్నారు.పెండింగ్‌లో ఉన్న విచారణలను వేగవంతంగా పూర్తి చేసేందుకు EROలు, AEROలు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని, నియోజకవర్గాల వారీగా పెండింగ్ కేసుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు.

**స్పీకింగ్ ఆర్డర్లలో స్పష్టత తప్పనిసరి**

ఓటరు పేరు తొలగింపు లేదా ఇతర మార్పులకు సంబంధించిన నిర్ణయాలను స్పష్టమైన కారణాలతో కూడిన స్పీకింగ్ ఆర్డర్ రూపంలో జారీ చేయాలని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఓటరు పేరు ముసాయిదా జాబితాలోకి వచ్చిన విధానం, అభ్యంతరానికి కారణం, సమర్పించిన పత్రాలు, విచారణలో తేలిన అంశాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.తుది నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత రికార్డులను పలుమార్లు పరిశీలించి పూర్తి బాధ్యతతో చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో అప్పీళ్లు వచ్చినా రికార్డుల ఆధారంగా నిర్ణయాన్ని సమర్థించుకునేలా వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు.

**డేటా ఎంట్రీపై నిరంతర పర్యవేక్షణ**

ఎన్యూమరేషన్ ఫారాల డేటా ఎంట్రీలో పొరపాట్ల కారణంగా నాన్‌మ్యాపింగ్ కేటగిరీల సంఖ్య పెరిగే అవకాశం ఉందని CEO పేర్కొన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ల పనితీరును సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి దశలో నాణ్యతా తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

**రాజకీయ పార్టీలకు సమాచారం అందించాలి**

క్లెయిమ్స్, అబ్జెక్షన్ల వివరాలను రోజువారీగా లేదా కనీసం వారానికి ఒకసారి సంబంధిత కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలని CEO సూచించారు. అవసరమైన చోట రాజకీయ పార్టీల ప్రతినిధులకు కూడా సమాచారం అందించాలని తెలిపారు. అనామలీస్ లిస్ట్, నాన్‌మ్యాపింగ్ కేటగిరీల వివరాలను సాధ్యమైన మేరకు రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. విచారణకు హాజరయ్యే ఓటర్లు సమర్పించాల్సిన పత్రాలపై ముందుగానే స్పష్టమైన సమాచారం ఇవ్వాలని, అవసరమైన ఆధార పత్రాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. విచారణల అనంతరం జరిగే అప్పీళ్ల ప్రక్రియకు కూడా సిబ్బందిని ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు.SIR ప్రక్రియలో నోటీసుల జారీ నుంచి వాటి స్వీకరణ, విచారణ, పత్రాల సమర్పణ, నిర్ణయం, స్పీకింగ్ ఆర్డర్ వరకు ప్రతి దశకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా భద్రపరచాలని CEO స్పష్టం చేశారు. ఒకే చిరునామాకు సంబంధం లేని వ్యక్తుల పేర్లు నమోదవడం, వాస్తవంగా ఆ ప్రాంతంలో నివసించని వ్యక్తుల పేర్లు జాబితాలో ఉండటం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఆర్‌డీఓ నవీన్, సంబంధిత ఎన్నికల అధికారులు

# కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం

**కల్వకుర్తి, ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి):**



కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అశ్వత్థామ రెడ్డి తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా డిపోల పర్యటనలో భాగంగా శనివారం కల్వకుర్తి డిపోకు చేరుకున్నారు. పాలమూరు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా డిపోకు చేరుకున్నారు. అనంతరం డిపో అధ్యక్షుడు శివ జగదీశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్ లో ఆయన మాట్లాడారు.

తమ సంఘం చేపట్టే కార్యక్రమాలు కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం మాత్రమేనన్నారు. ప్రభుత్వం విలీన ప్రక్రియ చేపట్టడానికి సిద్ధంగా ఉందని, అందులో తమ పాత్ర ఉండాలంటే రాబోయే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలలో మజ్దూర్ యూనియన్ విజయ దంకా మోగించాలన్నారు. కార్మికుల సమగ్ర ప్రయోజనం కోసం, ఎలాంటి సమస్య లేకుండా విలీన ప్రక్రియ పూర్తి చేసి న్యాయం జరగాలంటే కార్మికులు ఆలోచించాలన్నారు.గత 13 సార్లు జరిగిన ఎన్నికలకు, ప్రస్తుతం జరగబోయే ఎన్నికలకు చాలా తేడా ఉందన్నారు. ఇది కార్మికుల జీవన్మరణ సమస్య అని ప్రతీ కార్మికుడు ఆలోచించుకోవాలన్నారు. నిరంతరం కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నించామని, ఎన్నో విజయాలు సాధించిన విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు.రాష్ట్ర అధ్యక్షుడు అంజయ్య మాట్లాడుతూ కొంతమంది అసత్య ప్రచారాలు చేస్తూ కార్మికులను మోసం చేస్తున్నారని, నిరంతరం కార్మికుల పక్షాన నిలబడి సమస్యలను తీర్చిన మజ్దూర్ యూనియన్ కు మద్దతు ఇవ్వాలని కోరారు. డిపో అధ్యక్షుడు జగదీశ్వర్, కార్యదర్శి రవిలు మాట్లాడుతూ డిపోలో ఏ కార్మికునికి సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, రీజియన్ తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు నాగయ్య, మధు, చంద్రయ్య, శేషమ్మ, మల్లయ్య, సంతోష్ రెడ్డి, మంజుల, ఆరిఫ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

**హసన్ పర్తి ఆగష్టు29 (వుదయం ప్రతినిధి):**



హసన్ పర్తి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన పై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఇచ్చిన నిరసన కార్యక్రమాలలో భాగంగా శనివారం హసన్ పర్తి మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ హసన్ పర్తి మండల పార్టీ అధ్యక్షులు డాక్టర్ బండి రజనీకుమార్ మాట్లాడుతూ కేటీఆర్ ఇచ్చిన నిరసన కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గం హసన్ పర్తి మండలంలోని అన్ని గ్రామాల బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు వచ్చే నెల 2 వ తేది నుండి 8వ తేది వరకు వరకు జరిగే నిరసన కార్యక్రమాలలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టి, వారు చేసే మోసాలను ప్రజల మధ్యకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త మీద ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, 53 డివిజన్ ఇంచార్జ్ బోడ యుగంధర్, గిన్నారపు రవీందర్, ఇమ్మడి రాజేందర్, రాకేష్, చంద్రకర్ రెడ్డి, మారి, వేణు, ప్రమోద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం

## ఎస్సై సాంబమూర్తి.

**మహదేవపూర్: ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి)**



లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చు అని మహదేవపూర్ ఎస్సై ఎం. సాంబమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు భూపాలపల్లి కోర్టు ఆధ్వర్యంలో లోక్ అదాలత్ కార్యక్రమం ఈనెల 31 వతేది నుండి సెప్టెంబర్ 12 వతేది వరకు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు మహదేవపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు తమపై నమోదైన లేదా పెండింగ్‌లో ఉన్న రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా రాజీ ద్వారా కేసుల పరిష్కారం, సమయం, ఖర్చు ఆదా, సులభంగా న్యాయ పరిష్కారం, పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారం ఇలా ప్రయోజనాలు పొందవచ్చు అని వెల్లడించారు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు.

# గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడు అరెస్ట్

**జయశంకర్ భూపాలపల్లి: ఆగస్టు 29(వుదయం జిల్లా ప్రతినిధి):**



భూపాలపల్లి జిల్లా అడవిముత్తారం పోలీస్ స్టేషన్ పరిధిలో భూపాలపల్లి సీసీఎస్ పోలీసులు అడవిముత్తారం పోలీసులు శనివారం సంయుక్తంగా నిర్వహించిన దాడిలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేశారు.ఒడిశా నుంచి మేడారం మీదుగా కాటారం వైపు గంజాయిని అక్రమంగా తరలిస్తున్న దానం శశికృష్ణ (కాటారం గ్రామం)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 1 కిలో 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.70,000/గా అంచనా వేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.గంజాయి సేవించడం, విక్రయించడం లేదా అక్రమంగా రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

# ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**మహదేవపూర్: ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి):**



మహదేవపూర్ మండల కేంద్రంలోని *జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమంలో మొదటగా ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఈ సంవత్సరం రాష్ట్రస్థాయిలో ఆడిన క్రీడాకారులను సన్మానించి వారికి బహుమతులను అందజేశారు .ఈ సందర్భంగా పీఈటీ పూర్ణిమ మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవం యొక్క ప్రత్యేకతను గుర్తుచేస్తూ, ధ్యాన్ చంద్ పుట్టినరోజును జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా మన క్రీడాకారులందరూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ధ్యాన్ చంద్ లాగా పేరు తెచ్చుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధు, సరితా దేవి, లీలారాణి, రజిత, ప్రసూన, ఆంజనేయులు, సమ్మయ్య, అనూష మరియు విద్యార్థులు పాల్గొని వివిధ క్రీడలు నిర్వహించారు.

# ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



**బిజినేపల్లి, ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని వెలుగొండ గ్రామానికి చెందిన ఆస్కాని శ్రావణి అనారోగ్యంతో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గ్రామ నాయకులు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డిని కలిసి ఆర్థిక సహాయం కోరారు.వారి విజ్ఞప్తిపై ఎమ్మెల్యే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు.

ఈ కార్యక్రమంలో వెలుగొండ మాజీ డిప్యూటీ సర్పంచ్ నాగేష్, నాగోల్ లక్ష్మారెడ్డి, మాజీ వార్డు మెంబర్ కుందేళ్ళ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వీరముష్టి కుల సంఘం సభ్యుడు మిట్టపల్లి ప్రకాష్ మృతి

**వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (ఆగస్టు 29)**



తెలంగాణ వీరభద్రీయ అమీన్పూర్ కుల సంఘం సభ్యుడు మిట్టపల్లి ప్రకాష్ మృతి చెందారు. ప్రస్తుతం ఆయన కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన అంతిమయాత్ర ఆదివారం మధ్యాహ్నం 1 గంటలకు కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ నుంచి ప్రారంభమై, లింగంపల్లి పాపిరెడ్డి కాలనీ స్మశానవాటికకు చేరుకోనుందనీ వీరముష్టి కుల సంఘం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాష్ మృతి పట్ల వీరముష్టి కుల సంఘం సభ్యులు, స్థానికులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

# కడవెరుగు నర్సింలుకు చెరుకు శ్రీనివాస్ రెడ్డి నివాళి



**దుబ్బాక, ఆగస్టు 29 (వుదయం):**

దుబ్బాక మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కడవెరుగు గోపి తండ్రి కడవెరుగు నర్సింలు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి శనివారం నర్సింలు నివాసానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సింలు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి దేవస్థానంను దర్శించుకున్న స్నేహ కంపెనీ యజమాని

**మాగనూర్,ఆగస్టు 29 (వుదయం న్యూస్):**



గుడేబల్లూర్ మన గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్నేహ కంపెనీ యజమాని మన దేవాలయానికి రావడం జరిగింది ... ఆలయ పూజారి స్వామి వారి విశిష్టత గురించి స్నేహ కంపెనీ యజమానికి తెలియజేయడం జరిగింది ఆయన ఎంతో భక్తి శ్రద్ధలతో వివరాలు మరి అడిగి తెలుసుకున్నారు అలాగే ఆయన స్వామివారిని దర్శనం చేసుకున్న తర్వాత ఆలయంలో ఏవైనా అభివృద్ధి పనులు ఉంటే తెలియజేయండి అని ఆయన కమిటీ దగ్గర తెలుసుకున్నారు... వారితో మన దేవాలయం కోసం అభివృద్ధి పనులను వివరించడం జరిగింది అందుకు కంపెనీ యజమాని వారు వచ్చి శ్రీ వారి దివ్య దర్శనం అనంతరం శ్రీ వారి దేవాలయంలో మొత్తం గ్రానైట్ పనులు మరియు ఆలయ ప్రాంగణం మొత్తం గోడల మధ్య ఉన్న గచ్చు యొక్క పనులు మరియు బయట ( వరండాలో) సీసీ బెడ్స్ పనులు పూర్తి చేయిస్తానని శ్రీ వారి సేవకులు అయినట్టి పెద్దలకు మాట ఇవ్వడం జరిగింది.

# బోనాల పండుగలో డీజేలు వాడితే సీజ్: ఎస్ఐ కురుమూర్తి

**కల్వకుర్తి, ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి):**

కల్వకుర్తి పట్టణంలో బోనాల పండుగ ఊరేగింపులో డీజేలు ఉపయోగిస్తే సీజ్ చేస్తామని సబ్ ఇన్ స్పెక్టర్ సుగురు కురుమూర్తి హెచ్చరించారు.గత సంవత్సరం బోనాల పండుగ ఊరేగింపులో డీజేలు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించడమే కాకుండా పోలీస్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వారిని శనివారం స్టేషన్ కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రస్తుత బోనాల పండుగ ఊరేగింపును ప్రశాంతంగా నిర్వహించుకోవాలని హెచ్చరించి పట్టణ తహసీల్దార్ సమక్షంలో ఒక్కొక్కరికి లక్ష రూపాయల పూచీకత్తుతో బైండోవర్ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నిర్వాహకులు ఊరేగింపుల్లో డీజేలు ఉపయోగించినట్లయితే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో బోనాల పండుగను రాత్రి 8 గంటల లోపు పూర్తి చేసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పూర్తి బాధ్యత నిర్వాహకులదే ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



# సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం..
# ఫ్యూచర్ సిటీపై ఉన్న శ్రద్ధ నీటి ప్రాజెక్టులపై లేదు



- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య
- యాదాద్రి జిల్లాకు గోదావరి జలాల వాటా కేటాయించాలని డిమాండ్
- సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఉద్యమం

**యాదాద్రి భువనగిరి జిల్లా, 29 ఆగస్టు 2026**

సాగునీరు, తాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యు లు ఎస్. వీరయ్య విమర్శించారు. వ్యవసాయానికి ఊపిరైన సాగునీరు, ప్రజల జీవనానికి ఆధారమైన తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా ప్రభుత్వం ఇతర అంశాలపై దృష్టి సారించడం బాధ్యతారాహిత్యమని ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి ప్రాజెక్టులను పూర్తిచేయాలని డిమాండ్ చేస్తు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్రకు శనివారం భువనగిరి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రారంభ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ వీరయ్య మాట్లాడారు. మానవ నాగరికత చరిత్రలో సాగు, తాగునీటికి కీలక స్థానం ఉందని వీరయ్య అన్నారు. వ్యవసాయ రంగంపైనే పారిశ్రామిక, సేవా రంగాలు ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే రైతుల ఆదాయం పెరిగి ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, తద్వారా చిన్న వ్యాపారాలు, చేతివృత్తులు, పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని వివరించారు. చివరకు సేవా రంగం కూడా బలోపేతమై రాష్ట్ర జీడీపీ వృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

**7.5 లక్షల ఎకరాలున్నా.. పూర్తిస్థాయిలో నీరందని దుస్థితి**

యాదాద్రి భువనగిరి జిల్లాలో 7.5 లక్షల ఎకరాలకు పైగా సాగుభూమి ఉన్నప్పటికీ, ఏ ఒక్క ఏడాది కూడా మొత్తం భూమికి సాగునీరు అందలేదని వీరయ్య అన్నారు. గతంలో 4 నుంచి 4.5 లక్షల ఎకరాలకు నీరందితే గొప్పగా భావించే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం కరువు పరిస్థితులు నెలకొనడంతో కనీసం ఒకటి నుంచి రెండు లక్షల ఎకరాలకు నీరందుతుందో లేదో అనుమానంగా మారిందని పేర్కొన్నారు. జిల్లా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ జహంగీర్ నేతృత్వంలో భువనగిరి నుంచి హైదరాబాద్ వరకు మహా పాదయాత్ర చేపడుతున్నట్లు వీరయ్య తెలిపారు. హైదరాబాద్లో నిర్వహించే మహాధర్నాలో పాల్గొని ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రితో చర్చించి సమస్యల పరిష్కారంపై స్పష్టత తీసుకుంటామన్నారు. రాబోయే శాసనసభ సమావేశాల్లో సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం బహిరంగంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**చిన్న ప్రాజెక్టులను పూర్తి చేయడమే రైతాంగానికి తక్షణ ప్రయోజనం**

మాజీ శాసనమండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా యాదాద్రి భువనగిరి జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలు మాత్రం మారడం లేదనే అంశాన్ని సీపీఐ(ఎం) మరోసారి రాజకీయ అజెండాగా ముందుకు తెచ్చింది. ఒకటి రెండు భారీ ప్రాజెక్టుల కంటే బునాదిగాని కాలువ, పిలాయిపల్లి కాలువ, మూసీతో పాటు జిల్లాలో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న చిన్న ప్రాజెక్టులను పూర్తి చేయడమే రైతాంగానికి తక్షణ ప్రయోజనం కలిగిస్తుందని మాజీ శాసనమండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు



స్పష్టం చేశారు. భువనగిరి నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన మహా పాదయాత్ర ప్రారంభ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు జిల్లాలో నీటి రాజకీయాలపై మరోసారి చర్చకు తెరలేపాయి. అప్పట్లో బునాదిగాని, పిలాయిపల్లి వంటి ప్రాఇప్పుడుజెక్టులు రూ.20–25 కోట్ల స్థాయిలో ఉన్నాయని, కాలం గడిచే కొద్దీ వాటి నిర్మాణ వ్యయం అనేక రెట్లు పెరిగిందని ఆయన పేర్కొన్నారు. అంటే ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం కేవలం నీటి కొరతను మాత్రమే సృష్టించడం కాదు.. ప్రభుత్వ ఖజానాపై అదనపు భారాన్ని కూడా మోపుతోందన్నది ఆయన వాదన. ఈ అంశంలో సీపీఐ(ఎం) రాజకీయంగా ఒక కీలక ప్రశ్నను ముందుకు తెస్తోంది.

**నిధుల కొరత, ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా..**

సిపిఐఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లాలో సాగు, తాగునీటి కోసం చేపట్టిన ప్రాజెక్టులు, కాలువలు దశాబ్దాలుగా పెండింగ్లో ఉండటంపై సీపీఐ(ఎం) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిధుల కొరత, ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా 18 నుంచి 20 ఏళ్లుగా అనేక ప్రాజెక్టులు పూర్తి కాలేదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ ఆరోపించారు. పెండింగ్ ప్రాజెక్టులన్నింటికీ పూర్తి స్థాయి నిధులు కేటాయించి, గడువు నిర్ణయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల మహా పాదయాత్ర శనివారం భువనగిరి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైంది. రూ.450 కోట్ల గంధమల్లకు రూ.80 కోట్లేనా? గంధమల్ల రిజర్వాయర్ అంచనా వ్యయం రూ.450 కోట్లుగా ఉంటే, తాజాగా రూ.80 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించడం ద్వారా ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందని జహంగీర్ ప్రశ్నించారు. గతేడాది జూన్లో ముఖ్యమంత్రి శంకుస్థాపన సందర్భంగా రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటించారని, అయితే ఇప్పటివరకు పనులు ఆశించిన స్థాయిలో ప్రారంభం కాలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ పైళ్ల ఆశయ డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు కల్లూరి మల్లేశం దాసరి పాండు జెల్లెల పెంటయ్య బూరుగు కృష్ణారెడ్డి గుంటోజు శ్రీనివాసాచారి జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి సిర్పంగి స్వామి దయ్యాల నరసింహ మాయ కృష్ణ మద్దెల రాజయ్య బొల్లు యాదగిరి, బొడ్డుపల్లి వెంకటేష్ గుండు వెంకటనర్సు గంగదేవి సైదులు దోడ యాదిరెడ్డి మద్దేపూరం రాజు బోలగాని జయరాములు అవ్వారు రామేశ్వరి ఎంఎ ఇక్బాల్ వనం ఉపేందర్ గడ్డం వెంకటేష్ రాగీరు కిష్టయ్య మల్లేపల్లి లలిత బల్లూరి అంజయ్య కోట రామచంద్రారెడ్డి గోశిక కరుణాకర్ మండల కార్యదర్శులు జిల్లా ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిందితులకు త్వరగా శిక్షలు పడేలా దర్యాప్తు చేస్తాం

- గ్రామ ప్రజలు సమన్వయంతో ఉండాలి, చట్టాన్ని ఉల్లంఘించొద్దు
- సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ

**మెల్లచెరువు ఆగస్టు 30, (వుదయంవిలేకరి)**



సూర్యాపేట జిల్లా, కోదాడ సబ్డివిజన్ పరిధిలోని మేలచెరువు పోలీస్ స్టేషన్ పరిమితుల్లో ఉన్న ఎర్రగట్టు తండా గ్రామంలో ఇద్దరి హత్యల ఘటనా స్థలాన్ని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు స్థానిక డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించారు. హత్య ఘటన, గత గొడవల ఉదంతం పై అడిగి తెలుసుకున్నారు. పాత పగలు, వ్యక్తిగత కక్షలు కారణంగానే ఈ హత్యలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి బరోసా కల్పించారు. సంఘటన జరగటం బాధాకరం, చట్టంపై నమ్మకం ఉంచాలి, కఠిన శిక్షలు పడేలా పోలీసు దర్యాప్తు నిర్వహించి కోర్టుకు బలమైన సాక్షాలు ఆధారాలు అందజేస్తామని తెలిపారు. అమరబోయిన వెంకటేశ్వర్లు పై పక్కి ఇంటికి చెందిన భూక్యా పెదబాబు, భూక్యా రాము అతని తల్లి సహా దాడి చేసి హత్య చేశారు, అడ్డు వచ్చిన తండ్రిపై కూడా తీవ్రంగా దాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు అని ఎస్పీ అన్నారు. ప్రధాన నిందితుడు భూక్యా పెదబాబు గతంలో ఫిజిక్స్ టీచర్గా పనిచేస్తూ, ప్రవర్తనా లోపాలు మరియు నిబంధనల ఉల్లంఘన కారణంగా సస్పెండ్ అయ్యాడు. ఇతను గ్రామంలో తరచూ అనవసర వివాదాలు, పిటిషన్లు వేస్తూ అశాంతిని సృష్టిస్తున్నట్లు గతంలోనూ ఫిర్యాదులు ఉన్నాయి. ప్రత్యక్ష సాక్షుల సమాచారం మరియు ప్రాథమిక ఆధారాల మేరకు భుక్యా పెదబాబు, రాము, వారి తల్లిపై కేసు నమోదు చేసి నిందితులుగా చేర్చడం జరిగింది. ఈ కేసు విచారణ అధికారిగా కోదాడ రూరల్ ఇంచార్జి సీఐ రామకృష్ణారెడ్డి నియమించడం జరిగినది. అదుపులోకి తీసుకొని రిమాండ్కు తరలిస్తామని అధికారులు స్పష్టం చేశారు. బాధ్యులకు కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశ పెడతామని తెలిపారు. హుజూర్నగర్ పట్టణంలో ప్రభుత్వ హాస్పటల్ నందు మృతదేహాలను పరిశీలించారు.

## హత్య కేసు ఛేదించిన పోలీసులు

**మధిర, ఆగస్టు 29, వుదయం ప్రతినిధి:**



మధిర మండల పరిధిలోని ఆత్కూరు సమీపంలో ఈనెల 11 న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన తాలిమ్ హత్యకు గురైనట్లు వైరా ఏసిపి సారంగపాణి ఈ రోజు స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలోవెల్లడించారు.హత్యకు సంబంధించిన వివరాలను తెలుపుతూ హత్య చేసిన గద్దల జమలమ్మ గుంజి రాములమ్మను అరెస్టు చేసి రిమైండ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు.మధిర టౌన్ సిఐ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టి హత్య చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.హత్య కేసును ఛేదించిన మధిర సీఐ రమేష్ ను వారి బృందాన్ని వైరా ఏసిపి సారంగపాణి అభినందించారు.

## కాంగ్రెస్ నాయకులు హిరేకర్ శీను స్వాగతం

**యాదాద్రి భువనగిరి జిల్లా, 29 ఆగస్టు 2026**



భువనగిరి పార్లమెంటు సభ్యులు మరియు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ చైర్మన్గా నియమాకమై పదవి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా మొదటిసారిగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రానికి విచ్చేసిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు హిరేకర్ శీను స్వాగతం పలికి శాలుతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాల చైర్మన్ అవేసి చిస్తి, పీసీసీ డెల్ గెట్ తంగళ్ళపల్లి రవికుమార్, పీసీసీ కార్యదర్శి పత్నాక్ ప్రమోద్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, భువనగిరి పట్టణ ప్రెసిడెంట్ కూర వెంకటేష్, కౌన్సిలర్లు బింగి నరేష్, బొంతల నరసింహ, కోఆప్షన్ సభ్యులు కౌసర్ బాయ్, పిట్టల బాలరాజ్, ఈరపాక నరసింహ, అత్తర్, పులిగిల్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల పేరుతో కోట్ల వసూళ్ల ఆరోపణలు.. ఎమ్మెల్యే పీఏపై సమగ్ర విచారణ జరపాలి

- కళ్యాణ్ను విచారిస్తే కీలక విషయాలు వెలుగులోకి..
- అసలు కారకులను నిగ్గు తేల్చాలి సీపీఐఎంఎల్ మాస్ లైన్ డిమాండ్

**భద్రాచలం 29/8/26 వుదయం ప్రతినిధి:**




ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించి లక్షలాది రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న భద్రాచలం ఎమ్మెల్యే PA కళ్యాణ్ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని CPIML మాస్ లైన్ డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంలో ఒక్క వ్యక్తి పాత్రతోనే ఆగిపోకుండా, డబ్బుల వసూళ్ల వెనుక ఉన్న అసలు వ్యక్తులు, సహకరించిన వారు, డబ్బులు ఎక్కడికి వెళ్లాయనే అంశాలపై లోతైన విచారణ జరపాలని కోరింది. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది భద్రాచలం పట్టణంలోని అశోక్నగర్ కాలనీలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో CPIML మాస్ లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెచ్చెల రంగారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగులను నమ్మించి భారీ మొత్తాల్లో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు భద్రాచలం ప్రాంతంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయని అన్నారు.

మణుగూరు, బూర్గంపాడు, అశ్వాపురం, పినపాక మండలాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు నిరుద్యోగుల వద్ద ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కూలీలు, రిక్షా కార్మికులు, చిరు ఉద్యోగులు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వ్యక్తులు సైతం ఉద్యోగం వస్తుందనే ఆశతో తమకు ఉన్న డబ్బులు, అప్పులు చేసి తెచ్చిన మొత్తాలను ఇచ్చినట్లు బాధితులు ఆరోపిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా పలువురిని ఉద్యోగాల పేరుతో నమ్మించి ఒక్కొక్కరి వద్ద రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయని, మొత్తం వ్యవహారం దాదాపు రూ.10 కోట్ల వరకు ఉండవచ్చని రంగారెడ్డి ఆరోపించారు. అయితే ఈ మొత్తానికి సంబంధించి పూర్తి వాస్తవాలు పోలీసుల దర్యాప్తులోనే తేలాల్సి ఉందని, ప్రతి లావాదేవీని పరిశీలించి నిజానిజాలను బయటపెట్టాలని కోరారు.

**ఫిర్యాదులు చేసినా చర్యలు ఎందుకు లేవు?**

ఉద్యోగాల పేరుతో మోసపోయామని పలువురు పోలీసులను ఆశ్రయించినట్లు చెబుతున్నప్పటికీ, ఇప్పటివరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం పట్ల ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని రంగారెడ్డి అన్నారు. ప్రజలు తమ వద్ద ఉన్న చివరి రూపాయి వరకు నమ్మి ఇచ్చిన సందర్భంలో పోలీసులు ఈ అంశాన్ని అత్యంత సీరియస్గా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బాధితుల ఫిర్యాదులను పక్కన పెట్టకుండా చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేసి, ఆరోపణలపై విచారణ జరపాలని కోరారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తి వివరణ, పోలీసుల దర్యాప్తు ఫలితాలు కూడా వెలుగులోకి రావాల్సి ఉందని, విచారణ అనంతరం వాస్తవాలు స్పష్టమవుతాయని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధి కార్యాలయంతో సంబంధం ఉన్న వ్యక్తిపై ఉద్యోగాల పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు రావడం సాధారణ విషయం కాదని CPIML మాస్ లైన్ పేర్కొంది. ఇలాంటి ఆరోపణలు నిజమైతే ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని అన్నారు. బాధితుల నుంచి మరిన్ని ఫిర్యాదులు స్వీకరించి, వారికి చట్టపరమైన సహాయం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో CPIML మాస్ లైన్ కెచ్చెల కల్పన, దాసరి సాయి, మునిగేలా శివ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన మాజీ జెడ్పీటీసీ కుమారుడిని పరామర్శించిన మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

**సూర్యాపేట ఆగస్టు 29:**
**వుదయం ప్రతినిధి**



మండలంలోని దూపహాడ్ గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన మాజీ జడ్పీటీసీ పిన్నాని కోటేశ్వర రావు కుమారుడిని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి గాయపడిన యువకుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఆయన, మెరుగైన వైద్యం అందేలా అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దూపహాడ్ సర్పంచ్ నున్నపంగ కమలమ్మ సైదులు, ఉప సర్పంచ్ ఆర్తి నరేష్, కాంగ్రెస్ నాయకులు బిట్టు వీరయ్య, పబ్బతి కోటేశ్వరరావు, జనార్దన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, పెన్పహాడ్ మండల ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు పిన్నాని సందీప్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నకిరేకంటి వెంకన్న (కేకే), వెన్న ఉపేందర్, షేక్ రహీం, నర్సింగ్ కిరణ్, భూక్య మహేష్, పిల్లల నాగరాజు, బూర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## జగిని సక్కు బాయి మృతిపట్ల సంతాపం

**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 29**

నల్గొండ పట్టణంలోని ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త జగిని వెంకన్న తల్లీ జగిని సక్కు బాయి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సైదిరెడ్డి, రేగట్టే మల్లికార్జున్ రెడ్డి,నల్గొండ డిఎస్పి శివరాం రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ కే.ఆదిరెడ్డి, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దేవేందర్, స్థానిక కార్పొరేటర్ లింగస్వామి గౌడ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.జగిని వెంకన్న వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే, జగిని సక్కు బాయి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్ధిస్తున్నట్లు తెలిపారు.



## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**సత్తుపల్లి ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి)**

మండల పరిధిలోని భీమవరం గ్రామం లో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశానుసారం జిపిఓ సమక్షంలో శనివారం సర్పంచ్ వంట్లా రమేష్ స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రజలు ఎమ్మెల్యే మట్టా దయానంద్ కృతజ్ఞతలు తెలియజేయుచున్నారు.

## వీబీజీరామ్జీ పథకం పనులపై గ్రామసభ

**అనంతగిరి, వుదయం ప్రతినిధి**



మండల పరిధిలోని వాయిలసింగవరం గ్రామంలో వీబీజీరామ్జీ పథకం పనులపై శనివారం గ్రామ పంచాయితీ కార్యాలయం దగ్గర గ్రామసభను సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వీబీజీరామ్జీ పథకం పనులను గ్రామ ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు, ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని రైతులు పంట పొలాలలో నీటికుంటలు ఏర్పాటు చేసుకొని భూగర్భ జలాలను నిల్వచేసుకోవాలని సూచించారు. గ్రామంలో వితంతువులు,వికలాంగులు, బంటరి మహిళలు, గీత కార్మికులు, దయాలసిస్ పేషెంట్లు ఫైలేరియా వ్యాధిగ్రస్తులు చేయూత పెన్షన్లకు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కాకర్ల సౌమ్య ఉపసర్పంచ్ కంటు రమాదేవి వార్డు సభ్యులు దేవులపల్లి నాగరాజు తమలపాకుల వెంకటేష్ వీరబోయిన నాగరాజు మేట్లు కొల్లు సుబ్బారావు గడ్డం వీరబాబు మేళ్ళచెర్వు గురవయ్య గుండ్లపల్లి వెంకన్న కొల్లు సీతారామయ్య,కూలీలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కబడ్డీలో జాతీయ స్థాయిలో సత్తా చాటిన విద్యార్థినికి సన్మానం

**మధిర, ఆగస్టు 29, వుదయం ప్రతినిధి:**



జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మధిర మునగాల కృష్ణాపురానికి చెందిన కబడ్డీ క్రీడాకారిణి, శ్రీనిధి జూనియర్ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బి. హనీ (దుర్గ అరుణ)కు ఘన సన్మానం లభించింది. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడాకారుల సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, జిల్లా యువజన క్రీడల అధికారి సునీల్రెడ్డి హనీని సన్మానించిఅభినందించారు.హనీ ప్రస్తుతం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కేరళలోని కొల్లంలో కబడ్డీలో ప్రత్యేక శిక్షణ పొందుతోంది.జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారిణిగా గుర్తింపు పొందిన హనీకి ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, శ్రీనిధి జూనియర్ కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.

## సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటిసంవత్సరం తరగతులు ప్రారంభం

**ఓరియెంటేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యేలు మట్టా, జారే**

**సత్తుపల్లి ఆగస్టు 29 ( వుదయం ప్రతినిధి)**




సత్తుపల్లి మండల పరిధిలోని బి.గంగారం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎంసెట్ – 2026, కౌన్సిలింగ్,మరియు మేనేజ్ మెంట్ ద్వారా ఇంజనీరింగ్, యం.బి ఏ లో అడ్మిషన్స్ పొందిన విద్యార్థినీ,విద్యార్థులకు మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భముగా కళాశాల ఆడిటోరియం భవనంలో నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రాంకు విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి.అన్విద, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా.రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే. ఆదినారాయణ , గంగారం సర్పంచ్ కాకర్ల.రేవతి గ

ముఖ్య అతిథులుగా హాజరు అయ్యారు. విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి.అన్విద స్వాగతోపన్యాసం చేస్తూ విద్యార్థినీ,విద్యార్థులకు అభినందనలు/శుభాకాంక్షలు తెలియజేస్తూ జ్ఞానంతో మిమ్మల్ని మీరు ఆయుధం చేసుకోండి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రామయి దయానంద్ మాట్లాడుతూ ఈ ప్రత్యేకమైన ఓరియంటేషన్ డే సందర్భంగా మీతో ఇక్కడ ఉండటం నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ఉత్సాహభరితమైన యువ విద్యార్థులు తమ విద్యా ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించడం చూసి నేను చాలా సంతోషిస్తున్నానని. ప్రియమైన విద్యార్థులారా, విద్య అంటే కేవలం మంచి మార్కులు సాధించడం లేదా డిగ్రీ పొందడం మాత్రమే కాదు. అది జ్ఞానం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, విలువలు మరియు సవాళ్లను ఎదుర్కొనే ధైర్యాన్ని పెంపొందించుకోవడం. మీ ప్రతిభను కనుగొనడానికి, స్నేహాలను పెంచుకోవడానికి, మీ అనుభవాల నుండి నేర్చుకోవడానికి మరియు భవిష్యత్తు కోసం మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోవడానికి ఈ కళాశాల ఒక వేదిక అని అన్నారు.. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే. ఆదినారాయణ మాట్లాడుతూ మీలో ప్రతి ఒక్కరూ పెద్ద కలలు కనాలని, కష్టపడి పనిచేయాలని, మీ ఉపాధ్యాయులను మరియు తల్లిదండ్రులను గౌరవించాలని, మరియు వైఫల్యానికి ఎప్పుడూ భయపడవద్దని నేను ప్రోత్సహిస్తున్నాను. గుర్తుంచుకోండి, విజయం సాధించిన ప్రతి ఒక్కరూ ఒకప్పుడు ప్రారంభకులే. విద్యార్థులకు నాణ్యమైన విద్యను, సానుకూల అభ్యాస వాతావరణాన్ని అందించడంలో కృషి చేస్తున్న యాజమాన్యాన్ని, అధ్యాపక బృందాన్ని నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ముఖ్య అతిథిలుగా డాక్టర్ మట్టా దయానంద్ హాజరు అయ్యారు. కళాశాల సెక్రటరీ&కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ రోజున సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో అడ్మిషన్స్ పొందిన విద్యార్థినీ,విద్యార్థులకు మీ గ్రాడ్యుయేషన్ విద్య పూర్తి కాగానే తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకొనేలా తయారు చేస్తామని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్:పూటుకూరి.శేషారత్నకుమారి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఇంజనీరింగ్ సీట్లు భర్తీలో తమ కళాశాల 90%శాతంతో రెండవ స్థానంలో నిలిచిందని తెలియజేస్తూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నాణ్యమైన విద్య కొరకై సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల మీద నమ్మకంతో అడ్మిషన్స్ పొందిన ప్రతి విద్యార్థినీ,విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేసారు. కళాశాల సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్:ఎస్.కె.మీరా సాహెబ్ మాట్లాడుతూ "విద్యార్థి" అంటే అభ్యాసకుడు కళాశాల కల్పించే నాణ్యమైన వసతులను విద్యార్థులు సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్.యాకూబ్ , హెటేరో ఇన్స్టిట్యూట్ అఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ కొండా.రవికుమార్, డి ఏ వి స్కూల్ ప్రిన్సిపాల్ టి. శేషా సాయి శ్రీ కళాశాల కళాశాల కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ పాముల.శేఖర్ బాబు యూనివర్సిటీ (టైం టేబుల్, సిలబస్)ఆడకామిక్ ప్యాటర్న్ కు సంబంధించిన విషయాలను కూలంకుషంగా వివరించారు. అన్ని ఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు, అన్ని బ్రాంచీల ఫ్యాకల్టీ మెంబర్స్,కళాశాల సిబ్బంది మరియు విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొని ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు,నృత్యాలు,పాటలు,చిన్నస్కిట్స్ మొదలైనవి ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థినీ,విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## సూర్య విక్రమాదిత్య పుట్టినరోజు వేడుకలు

**మధిర, ఆగస్టు 29, వుదయం ప్రతినిధి:**



తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క తనయుడు సూర్య విక్రమాదిత్య పుట్టినరోజు వేడుకలను మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సూర్య విక్రమాదిత్యకి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఆయన ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పారుపల్లి విజయ్ కుమార్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత రామనాథం, వైస్ చైర్మన్ కోన ధని కుమార్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు,మిరియాల వెంకటరమణ గుప్తా,కౌన్సిలర్లు శ్రీపాల శెట్టి వెంకట్రావు,నకిరికంటి రాజేశ్వరి,షేక్ రసీదున్,దార నాగార్జున,సర్పంచులు బట్ట అంజన్ బాబు,సంపసాల రామకృష్ణ,హరినాథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి రామాలయం కమిటీ చైర్మన్ వంగవీటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీలో పడి గాయాలైన వ్యక్తికి వైద్యం అందించిన 108 సిబ్బంది

**సత్తుపల్లి ఆగస్టు 29 ( వుదయం ప్రతినిధి)**

సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన షేక్. నూర్ అహ్మద్ 30 సంవత్సరములు. పొలం పని ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో ఇంటి ముందు ఉన్న సిమెంట్ డ్రైనేజీలోకి ద్విచక్ర వాహనం వెళ్లిపోయి పడిపోయాడు. తలకు బలమైన గాయమైంది చర్మం మొత్తం విడిపోయింది. తీవ్ర గాయాలు పాలైన నూర అహ్మద్ కొరకు సమాచారం అందుకున్న సత్తుపల్లి 108 సిబ్బంది ఈఎంటి ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గొల్ల మండల.కృష్ణ. పైలెట్ పాలడుగు.వేణు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని అక్కడికక్కడే వైద్యం ప్రారంభించి అంబులెన్స్ లో ఎక్కించుకొని వైద్యం అందిస్తూ సత్తుపల్లి ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్పించారు, సకాలంలో స్పందించిన సత్తుపల్లి 108 సిబ్బందిని గంగారం గ్రామస్తులు, ప్రోగ్రామ్ మేనేజర్ షేక్. నజీరుద్దీన్ జిల్లా మేనేజర్ ఆలేటి. ప్రణయ్ కుమార్ అభినందించారు



# మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్డీ) సమావేశంలో అదనపు కలెక్టర్

పెద్దపల్లి ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి)

మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పేర్కొన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్డీ) సమావేశంలో ఆయన పాల్గొని జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, యువత జీవితాలను మాదకద్రవ్యాల మహమ్మారి నాశనం చేస్తోందని, సరదా కోసం కూడా ఎటువంటి మత్తు పదార్థాలు చెడు అలవాట్లకు అలవాటు పడవద్దని సూచించారు. ఒకసారి మాదకద్రవ్యాలకు బానిసైతే వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎక్కడైనా గంజాయి సాగు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో మాదకద్రవ్యాలకు సంబంధించిన ప్రతి వివరాన్ని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమాలతో పాటు డ్రగ్స్ దుష్పరిణామాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



నిర్వహించాలని సూచించారు.పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రజా ప్రదేశాలు, రవాణా కేంద్రాల వద్ద తరచూ తనిఖీలు నిర్వహించాలని, విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై నిరంతర అవగాహన కల్పించాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసైన వారు చికిత్స పొందేందుకు రామగుండం ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ–అడిక్షన్ కేంద్రాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, సెక్షన్ పర్యవేక్షకులు ధీరజ్ , జిల్లా పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, రెవెన్యూ శాఖ, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై దమ్మపేటలో సమరశంఖం



- పార్టీ ఏది ఆదేశిస్తే...దానికోసమే మనం పని చెయ్యాలి - మాజీ ఎమ్మెల్యే మెచ్చా
- ఆ 6 గ్యారంటీల కార్డులు ఇప్పుడు ఎక్కడ పెట్టుకోవాలి?: ఉప్పల వెంకటరమణ

దమ్మపేట ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి ):

అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం దమ్మపేట మండల కేంద్రంలోని వినాయక ఫంక్షన్ హాల్ నందు అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వర రావు అధ్యక్షతన ఘనంగా జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఇంచార్జ్ ఉప్పల వెంకట రమణ హాజరయ్యారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ భవిష్యత్ కార్యాచరణపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ గారి పిలుపు మేరకు సెప్టెంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో కార్యకర్తలంతా పాల్గొని విజయవంతం చేయాలి.పార్టీలో వర్గ పోరును సహించేది లేదు. అధిష్ఠానం ఆదేశాలను ధిక్కరిస్తే నాతో సహా ఎవరిపైనైనా కఠిన చర్యలు తీసుకునేందుకు పార్టీ వెనుకాడదు.రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు మరో 2 సంవత్సరాలు ఉండగానే ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం ఉంది, శ్రేణులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని మండలాలకు సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయ్యాయి. కేసీఆర్ గారు ఎవరికి బాధ్యతలు అప్పగిస్తే వారి గెలుపు కోసం అంతా కష్టపడి పనిచేయాలి. ఉప్పల వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఒక కార్డు ఇచ్చి అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్న మంత్రి భట్టి విక్రమార్క ఇప్పుడా కార్డును ప్రజలు ఎక్కడ పెట్టుకోవాలో సమాధానం చెప్పాలి.రాష్ట్రంలో 'అచ్చ కాంగ్రెస్ వర్సెస్ పచ్చ కాంగ్రెస్' నడుస్తోందని సాక్షాత్తూ మంత్రి కొండా సురేఖ కూతురు చేసిన వ్యాఖ్యలే ఈ ప్రభుత్వ డొల్లతనానికి నిదర్శనం. ముఖ్యమంత్రి తీరుతో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం కేంద్రం ఇచ్చే 75% నిధులు సైతం వెనక్కి వెళ్లే ప్రమాదం ఉంది.నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ వర్గానికి ఎంత బాకీ ఉందో తెలియజేస్తూ 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో ప్రదర్శన నిర్వహిస్తాం. కేసీఆర్ గారి నాయకత్వాన్ని బలహీనపరిచేలా ఎవరు వ్యవహరించినా చర్యలు తప్పవు. ఈ సమావేశంలో మండల మాజీ అధ్యక్షులు,మండల నాయకులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# 15 ఏళ్లుగా ఇంటి నెంబర్లు ఇవ్వని మునిసిపల్ అధికారులు

**కలెక్టర్ చొరవతో ఇంటి నెంబర్లు ఇచ్చిన మునిసిపల్ అధికారులు**

రాయికల్ ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి)

కలెక్టర్ మునిసిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన ఇంటర్నేషనల్ ఉమెన్స్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి. నిరుపేదలు 15 ఏళ్లుగా ఇంటి నెంబర్ల కోసం జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ ఇందిరా కాలనీ వారు ఎదురుచూపులు ఈ విషయమై జగిత్యాల్ కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణి కలెక్టర్ కు ఇచ్చిన వినతి పత్రం ద్వారా స్పందించిన కలెక్టర్ వారికి ఇంటి నెంబర్ ఇవ్వడం సంతోషకరమైన విషయం. ఈ విషయంలో కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపిన జగిత్యాల జిల్లా ఇంటర్నేషనల్ ఉమెన్స్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షులు ఆడెపు రాజమౌళి.

గతంలో పలు దినపత్రికలలో ప్రజావాణి ద్వారా ఇంటర్నేషనల్ ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఆడెపు రాజమౌళి ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఇంద్ర నగర్ కాలనీ సుమారు 20 నుంచి 30 మందికి ఇంటి నెంబర్లు కేటాయించినందుకు కలెక్టర్ కి అలాగే రాయికల్ మున్సిపల్ కమిషనర్ కి చైర్మన్ కి కౌన్సిలర్ కి కృతజ్ఞతలు రాజమౌళి తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆదాయ నివాస ధ్రువపత్రాలకు ప్రభుత్వ ఇతర ప్రభుత్వ సేవల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అనుకూలం జరిగిందని ఆడెపు రాజమౌళి ఆనందం వ్యక్తం పరిచారు.

# మైనార్టీ వర్గాలకు చెందిన విద్యావంతులైన యువత కోసం

**గ్రూప్ 1, 2, 3, 4కు ఉచిత జనరల్ స్టడీస్ ఫౌండేషన్ కోచింగ్ కొరకు దరఖాస్తు ఆహ్వానం**

జగిత్యాల ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి)

తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్ టీజీఎంఎస్ అండ్ సిసిసి హైదరాబాద్ తెలంగాణలోని మైనారిటీ కమ్యూనిటీలకు చెందిన అర్హులైన అభ్యర్థుల నుండి టీజీపీఎస్సీ గ్రూప్ 1 2 3 4 పరీక్షల ఉచిత బేసిక్ ఫౌండేషన్ కోచింగ్ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తుంది తెలంగాణలోని మైనార్టీ కమ్యూనిటీలకు (ముస్లిం క్రైస్తవులు సిక్కులు జైనులు పార్సీలు బౌద్ధులు) చెందిన దారిద్ర రేఖకు దిగువన ఉన్న బిపిఎల్ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. విద్యార్హత గ్రాడ్యుయేషన్ డిగ్రీ పూర్తి అయి ఉండాలి ముఖ్యమైన తేదీలు దరఖాస్తు స్వీకరణ ప్రారంభం తేదీ 1 9 2026 దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 14 9 2026 తరగతులు ప్రారంభం తేదీ 15. 9. 2026 వంద మంది విద్యార్థులు మాత్రమే అవసరమైన పత్రాలు అర్హులు డిజిటల్ స్కానింగ్ కొరకు తమ అన్ని ఒరిజినల్ విద్యా సర్టిఫికెట్లు ఆధార్ కార్డ్ ఒక ఫోటో పాస్పోర్ట్ సైజ్ సమర్పించవలెను రిజిస్ట్రేషన్ కోచింగ్ వేదిక తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కాలేజ్ ప్రాంగణం ఎంఎఎన్ క్యాంపస్ ఇంటర్మీడియట్ బోర్డ్ వెనకాల శ్రీ బాలాజీ ఎన్ లేవు నాంపల్లి హైదరాబాద్ మరిన్ని వివరాల కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ 040 232 36112 90590 50062 email:directormccctelangana@gmail.com అన్ని పని దినాల్లో ఉదయం 10 గంటల 30 నిముషాల నుండి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చు.

# వీధి లైట్లు వేస్తుండగా విద్యుత్ షాక్.. ఎలక్ట్రిషన్ మృతి

మునగాల, ఆగస్టు 29 (వుదయం):

మునగాల మండలం కోదండరామాపురం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామంలో వీధి లైట్లు ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఎలక్ట్రిషన్ మృతి చెందాడు. కోదండరామాపురం గ్రామానికి చెందిన బుర్రి వీరబాబు (29), తండ్రి మంగయ్య, విద్యుత్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం గ్రామంలో వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన వీరబాబు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

రాయికల్ ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి)

జాతీయ క్రీడ,తెలుగు భాష దినోత్సవాల సందర్భంగా శనివారం జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులను, తెలుగు పండితులను శాలువా మెమొంటోలతో సన్మానించారు. అనంతరం రాయికల్ బాయ్స్ హై స్కూల్ లో బాస్కెట్ బాల్ స్టేట్ పూర్వ క్రీడాకారులు వాసం ప్రసాద్, దాసరి గంగాధర్, బందెల శ్రీనివాస్, తాటిపాముల శ్యామ్, దేవేందర్ల సహకారంతో పదిహేను వేల రూపాయలతో బాస్కెట్ బాల్ కోర్టు లో రింగ్స్, కలర్లు, బాస్కెట్ బాల్ ను అందించి కోర్టును ప్రారంభించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ మాట్లాడుతూ మేజర్ ధ్యాన చంద్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు.ధ్యాన చంద్ లాంటి ప్రతిభావంతులు మైదానంలో మెరువాలన్న మనలాంటి విద్యార్థులు మెరుగుపడాలన్న మూల స్తంభం వ్యాయామ ఉపాధ్యాయులు ఎండానక వాననక మనతో నిలబడి క్రీడా విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఛాంపియన్లుగా మార్చడానికి వారు పడే శ్రమ అమూల్యమైనవని



అన్నారు.తెలుగు భాష ప్రాముఖ్యత తెలిపారు.వ్యాయామ ఉపాధ్యాయులు పుర్రె రమేష్,తెలుగు పండితులు చెరుకు మహేశ్వర శర్మ తదితరులను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో సెక్రెటరీ కనపర్తి శ్రీనివాస్, ట్రెజరర్ మురళి గౌడ్, మ్యాకల రమేష్, బత్తిని భూమయ్య,, దాసరి గంగాధర్, మచ్చ శేఖర్, ఆడెపు రాంప్రసాద్, కురుమ సుదర్శన్ రెడ్డి, బాలే నిఖిల్, సాంబార్ శ్రీను, పులి రమేష్, సామల సత్యనారాయణ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.

# శానిటేషన్ స్ప్రే

రాయికల్ ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి)





జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ 6వ వార్డులో వర్షాకాలంలో దోమలు ఎక్కువగా ఉండటం వల్ల ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల మేరకు దోమలు నిల్వ ఉండకుండా డ్రైనేజీలపై శానిటేషన్ స్ప్రే చేయిస్తున్న 6వ వార్డు కౌన్సిలర్ వేముల మౌనిక రాము.6వ వార్డ్ అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్న కౌన్సిలర్ ని 6వ వార్డు ప్రజలుఅభినందించారు.

# సాయి జీనియస్ హై స్కూల్ లో ఆరెంజ్ డే వేడుకలు



కోరుట్ల ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణంలో గల సాయి జీనియస్ హై స్కూల్ లో శనివారం ఆరెంజ్ డే వేడుకలు నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలో భాగంగా పిల్లలు ఉపాధ్యాయులు అందరూ ఆరెంజ్ కలర్ డ్రెస్ లు ధరించారు ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చౌకీ రమేష్ మాట్లాడుతూ ఆరెంజ్ రంగు ఉత్సాహం ఆనందం తాజాధనం కు చిహ్నం అని ఈ రంగు ఎరుపు యొక్క శక్తిని పసుపు యొక్క సంతోషాన్ని కలిగిన రంగు అని ఈ రంగులో దొరికే పండ్లు కూరగాయలను ఎక్కువ మోతాదులో తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు ఆరింజ పప్పాయ క్యారెట్ గుమ్మడి కాయ మొదలైనవి వీటిలో విటమిన్ ఏ విటమిన్ సి ఫైబర్ పొటాషియం లభిస్తాయని వీటిని తీసుకోవడం వలన ఆరోగ్యంగా దృఢంగా వ్యాధి నిరోధక శక్తి కలిగి ఉంటామని కావున ప్రతి రోజు ఏదైనా ఒక ఆరెంజ్ రంగులో ఉన్న కూరగాయలను తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు ఆనందంగా పాల్గొన్నారు

# 'స్వారో జ్ఞాన సమ్మేళనం' పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లి ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి)

దాసరి ఉష గారి నేతృత్వంలో, ఫిట్ అండ్ ఫ్యూచర్ అధ్యక్షులు మచ్చ రాహుల్ , ఉపాధ్యక్షులు కలవల చరణ్ & స్వేరో ఉపాధ్యక్షులు సదిరం మనోహర్ సహకారంతో. కాల్వ శ్రీరాంపూర్ యువ నాయకులు అరవింద్, కుమ్మరికుంట కుమార్, నవీన్, సదానందం... ఆధ్వర్యంలో "స్వారో జ్ఞాన సమ్మేళనం" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సమాజంలో జ్ఞాన చైతన్యాన్ని, విద్యాభివృద్ధిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ స్వారో జ్ఞాన సమ్మేళనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వంగ తిరుపతిరెడ్డి , సర్పంచ్ బూసి సదాశివ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జూకంటి శిరీష ,



మాజీ సర్పంచ్ ఆడెపు శ్రీదేవి రాజు, పెగడపల్లి వార్డ్ సభ్యులు నవీన్ యాదవ్, వడ్నాల శ్రీనివాస్ ప్రముఖయూత్ అధ్యక్షుడు కుమార్ , వార్డ్ మెంబర్ అజయ్ కుమార్ , అజయ్ , అర్జున్ , నాయకులు మరియు స్వారోస్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# సరస్వతీ శిశు మందిరం పునర్ నిర్మాణానికి సహాయం

రాయికల్ ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి)

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో శ్రీ సరస్వతీ శిశు మందిరం అభివృద్ధికి కురుమ పెద్ద మల్లారెడ్డి ₹20,116/– విరాళంగా (భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు) శ్రీ బోడగం మోహన్ రెడ్డి కి అందజేశారు. ఈ సందర్భంగా కడుకుంట్ల ప్రభాకర్ మాట్లాడుతూ మన సంస్కృతి మన సనాతనం సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చదివే విద్యార్థులకు సంస్కృతంగా సనాతన ధర్మాన్ని సంస్కృతిని నేర్పడడంలో ఒక సరస్వతి శిశు మందిర్ పాఠశాలలోనే జరుగుతుందని, పూర్వ విద్యార్థులు సనాతన ధర్మాన్ని కాపాడే నాయకులు ప్రజలు తోచిన విధంగా శిశు మందిర్ పాఠశాల పునర్విపారానికి సాహయపడగలరని కోరారు . ఈ కార్యక్రమంలో గాజంగి అశోక్ , బొమ్మ కంటి గోపాల్ జీ, కడకుంట్ల ప్రభాకర్, బూర్ల రాజ గంగారం, మామిడాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. విద్యా సంస్థ అభివృద్ధికి అందించిన ఈ విలువైన సహాయానికి శ్రీ సరస్వతీ శిశు మందిరం కార్యవర్గం తరపున కృతజ్ఞతలు తెలియచేసారు.

# పల్లె దవాఖాన తొందరగా ప్రారంభించాలి

మల్లాపూర్ ఆగస్టు 29 (వుదయం విలేకరి)

ఆయుషమాన్ ఆరోగ్య మందిర్ ను త్వరగా ప్రారంభించి గ్రామస్తులకు మెరుగైనా వైద్యం అందేలా చుడాలనీ మననేస్తాం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బొడ్డు రాజేష్ డిమాండ్ చేశారు మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో గత ప్రభుత్వంలో మాజీ సర్పంచ్ బొడ్డు సుమలత కృషితో మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సహకారంతో సుమారు 20లక్షల అంచనా వ్యయం తో మంజూరి



చేయించడం జరిగిందని ఇట్టి ఆరోగ్య కేంద్రం కు సంబంతిత అధికారులు శ్రద్ద చూపి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బొడ్డు రాజేష్ అన్నారు.

# రాజు భూపాల్ గౌడ్ నిరాహార దీక్షకు బండమీది వెంకటేష్ సంఘీభావం



- రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు
- విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి అవసరం..
- సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ బాధ్యతలు వదులుకోవాలి: బండమీది వెంకటేష్

శంకర్‌పల్లి ఆగస్టు 29 (వుదయం)

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ, భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో 'ఫీజుల బకాయి – బీజేపీ లడాయి' పేరిట రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీ రాజు భూపాల్ గౌడ్ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే త్వరలోనే సచివాలయాన్ని ముట్టడిస్తామని రాజు భూపాల్ గౌడ్ హెచ్చరించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ చేపడుతున్న ఆందోళనలకు వివిధ వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. ఇదే క్రమంలో చేవెళ్ల నియోజకవర్గ బి.సి. సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండమీది వెంకటేష్ నిరాహార దీక్షకు హాజరై రాజు భూపాల్ గౌడ్‌కు సంఘీభావం తెలిపారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా రాష్ట్రంలోని సుమారు 40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఫీజులు చెల్లించకపోవడంతో పలువురు విద్యార్థులు కళాశాలల నుంచి సర్టిఫికెట్లు పొందలేక ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. మరోవైపు బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కూడా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని, దీని ప్రభావం విద్యా వ్యవస్థపై పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.చేవెళ్ల నియోజకవర్గ బి.సి. సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండమీది వెంకటేష్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యను ప్రభుత్వం ఇకనైనా తీవ్రంగా పరిగణించాలని కోరారు. బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం, ఉన్నత చదువులు మరియు ఉద్యోగాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆ బాధ్యతలను వదులుకుని రాష్ట్రానికి పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని బండమీది వెంకటేష్ డిమాండ్ చేశారు. విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి ఉంటే విద్యార్థులు, కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీ రాజు భూపాల్ గౌడ్ చేపట్టిన నిరాహార దీక్షకు బండమీది వెంకటేష్ మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటాలకు తమ సంఘం అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.



# విజ్జన్నకు రాఖీ కట్టిన సీతక్క

పెద్దపల్లి ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి)

రాఖీ (రక్షాబంధన్) పండగను పురస్కరించుకొని హైదరాబాద్ లోని రాష్ట్ర సెక్రటేరియట్లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క) గారు గౌరవ ప్రభుత్వవిప్ పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు గారికి రాఖీ కట్టి,రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# అమ్మ భాషను అందరూ ఆదరించాలి



పెద్దపల్లి ఆగస్టు 29 (వుదయం ప్రతినిధి)

కమ్మనైన తేటతెనుగు అమ్మ భాషను అందరూ ఆదరించాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య కోరారు. శనివారం ఆయన పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల పిల్లలకు పద్యాల పోటీలు, తెలుగు భాషలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పిల్లలకు తెలుగు భాషా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశభాషల్లోకెల్లా తెలుగు భాష అత్యంత గొప్పదని, కఠిన హృదయాలను సైతం కరిగించే శక్తి తెలుగు భాషకు ఉందన్నారు. మానవతా సమాజంలో అనేక రుగ్మతలు, మూఢనమ్మకాలను తొలగించి వైజ్ఞానిక సమాజాన్ని ముందుకు నడిపించడంలో తెలుగు భాష ఎంతో దోహదం చేస్తుందన్నారు. అన్య భాషల్లో కంటే మాతృభాషలో బోధన చేయడం ద్వారా పిల్లలకు విషయం పరిపూర్ణంగా అర్థమవుతుందని, తద్వారా పిల్లలు ఉన్నత స్థాయికి చేరే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుత సమాజంలో ఆంగ్ల భాష మోజులో పడిన చాలామంది తెలుగు భాషను పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాషాభివృద్ధి దాని విస్తృతికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్, మంద శ్రీవాణి, పలువురు పాల్గొన్నారు.

